చెరుకు రైతుల బకాయిలు చెల్లించాలి

తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి యాదవరెడ్డి

నవ తెలంగాణ జహీరాబాద్



జహీరాబాద్‌లోని ప్రైవేట్ చక్కెర పరిశ్రమ యజమాన్యం రైతులకు వెంటనే బకాయిలు చెల్లించి క్రషింగ్ ప్రారంభించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి యాదవరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని హెూతిబి గ్రామంలో చెరుకు రైతులతో సమావేశమయ్యారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన యాదవరెడ్డి మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాంతంలో రైతులు ప్రధానంగా ట్రైడెంట్ చక్కెర యాజమాన్యాన్ని నమ్ముకొని రైతులు చెరుకు పంట సాగు చేశారని తెలిపారు. యాజమాన్యం రైతులను మోసం చేసి కోట్ల రూపాయలు బకాయిలు పెట్టి పరిశ్రమను మూసివేసిందన్నారు. రైతులకు వెంటనే బకాయిలు చెల్లించి క్రషింగ్ ప్రారంభించే విధంగా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున రైతులను సమీకరించి యాజమాన్యంపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన మేరకు వెంటనే రైతులకు రూ.రెండు లక్షల రుణ మాఫీ చేయాలని, అన్ని పంటలకు ఇన్సూరెన్స్ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ మల్లారెడ్డి, రైతు సంఘం నాయకులు సిహెచ్.కిష్టప్ప, లక్ష్మారెడ్డి, జాకీర్ ముయోద్దీన్, వెంకటేష్ , సురేష్, సంగారెడ్డి, అల్లావుద్దీన్, నగేష్, నరేష్ ,సయ్యద్ జమీర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ వల్లూరి క్రాంతికి శుభాకాంక్షలు

నవతెలంగాణ-సంగారెడ్డి



సంగారెడ్డి జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వల్లూరి క్రాంతిని శనివారం సీపీఎం జిల్లా కమిటీ శుభాకాంక్షలు తెలిపింది. కార్యక్రమంలో సీపీఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మల్లేశం, మాణిక్యం, నాయకులు కృష్ణ, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ వల్లూరి క్రాంతిను కలిసిన కేవీపీఎస్ బృందం

సంగారెడ్డి జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వల్లూరి క్రాంతిని కలిసి కేవీపీఎస్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి బృందం శుభాకాంక్షలు తెలిపింది. కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్, జిల్లా అధ్యక్షులు అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్, యువ న్యాయవాది సుభాష్, జిల్లా సహాయ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు ప్రశాంత్ పాల్గొన్నారు.

10 వరకు జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రద్రర్శన

నవ తెలంగాణ-సంగారెడ్డి



సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోనీ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు జరిగే జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు కోరారు. సంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం తుది సన్నాహక సమావేశం నిర్వహించారు. 11 కమిటీల కన్వీనర్లు, కో కన్వీనర్‌ల తోపాటు ఆయా కమిటీల మెంబర్లు హాజరయ్యారు. డీఈఓ ప్రతి కమిటీ కన్వీనర్, కో కన్వీనర్లతో మాట్లాడుతూ వారు చేసిన ఏర్పాట్ల గురించి చేయాల్సిన ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈసారి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలల నుండి సుమారు 900 వరకు ప్రదర్శనలు రావచ్చన్నారు. వాటికి అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. జిల్లా సైన్స్ అధికారి విజయకుమార్, సీఎంఓ వెంకటేశం, సెయింట్ ఆంథోనీ కళాశాల యాజమాన్యం సొల్మన్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, డి సి ఈ బి సెక్రటరీ లింబాజీ, మీడియా కన్వీనర్ జాకీర్ హుస్సేన్ ,ఓవరాల్ కమిటీ ఇంచార్జెస్ ప్రభాకర్, జగదీశ్వర్, 11 కమిటీల కన్వీనర్ లు కోకన్వీనర్లు పాల్గొన్నారు.

మహిళలకు ధైర్యం నింపేందుకే భరోసా కేంద్రాలు

నవతెలంగాణ-సంగారెడ్డి



మహిళలకు ధైర్యం నింపేందుకే భరోసా కేంద్రాలు కొనసాగుతున్నాయని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మెడికల్ అధికారులకు, మహిళా పోలీసు అధికారులకు సిబ్బందికి పోక్సో, అత్యాచార కేసులపై శనివారం సెన్సిటైజేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అత్యాచార, పోక్సో వంటి కేసులలో లైంగిక దాడులకు గురైన మహిళలకు భరోసానిస్తూ, వారిలో కొండంత ధైర్యాన్ని నింపేందుకే దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. బాధిత మహిళలకు అన్నిరకాల సేవలను ఒకే గొడుగు కిందికి తీసుకురావాలన్నదే భరోసా సెంటర్ ఉద్దేశమన్నారు. అదనపు ఎస్పీ డా. పి.అశోక్ మాట్లాడుతూ దేశంలో 80 శాతం పోక్సో కేసులే అన్నారు. మెడికల్ సూపరింటెండెంట్ డా.అనిల్ మాట్లాడుతూ డాక్టర్ ఏయే కేసులలో మెడికల్ ఎగ్జామిన్ చేయాలనే విషయాలను సెన్సిటైజేషన్ ద్వారా వివరించారు. ఫోరెన్సిక్ సైన్స్ అండ్ మెడిసిన్ డిపార్ట్మెంట్, ప్రొఫెసర్ డా.సుధ మాట్లాడుతూ బాధిత మహిళల నుండి శాంపిల్స్ ఏవిధంగా సేకరించాలి, మెడికల్ ఎగ్జామిన్ ఫామ్ ఏవిధంగా ఫిల్ చేయాలనే విషయాలను వివరించారు. కార్యక్రమంలో పోలీస్ డా.జ్యోతి, డా.వీణ, డా.నరేష్, డా.రాజేష్, డా.అఖిల, పోలీస్ డా.జ్యోతి, డా. ప్రియదర్శిని, డా.మానస, డా.సౌజన్య, డా. శిల్ప, డా. నమ్రత, డా. వాణి ప్రత్యూష, డా. నాగవీణ, డా. రజిని, డా. కె.వి.సందీప్, రమేష్ కుమార్ డియస్పి, సంగారెడ్డి, బి.రమేష్ ఇన్స్పెక్టర్ డీసీఆర్బీ, జిల్లా పోలీసు మహిళా అధికారులు, సిబ్బంది, భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

దొరల పాలన అంతం.. ప్రజా పాలన ప్రారంభం

నవతెలంగాణ- సదాశివపేట



రాష్ట్రంలో దొరల పాలన అంతమై ప్రజాపాలన ప్రారంభమైందని డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జయప్రకాశ్‌రెడ్డి అన్నారు. సదాశివపేట మండలం నందికంది గ్రామంలో శనివారం నిర్వహించిన ప్రజాపాలనలో ఆమె ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను తప్పకుండా నెరవేరుస్తుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చాట్ల సిద్దన్న, మండల ఉపాధ్యక్షుడు దస్తూరి విట్టల్, ఎంపీపీ మనోజ్ రెడ్డి, టీ జే ఆర్ యువసేన మండల అధ్యక్షుడు డి.చింటూ గౌడ్, కొలుకూరు గ్రామ సర్పంచ్ భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేయండి

- మంత్రి దామోదర్‌కు మెదక్ ప్రెస్ క్లబ్ వినతి

నవతెలంగాణ - మెదక్



జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని మెదక్ జిల్లా కేంద్రంలో వెల్నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దొంతి నరేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం మెదక్ పట్టణంలోని సాయి బాలాజీ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు, స్థానిక ఎమ్మెల్యే రోహిత్ రావుకు మెదక్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెదక్ జిల్లాలో సుమారు వెయ్యి మంది జర్నలిస్టులు, సుమారు 5 వేల మంది ప్రభుత్వ పెన్షన్‌దారులు ఉన్నారన్నారు. వీరందరికీ వైద్య సేవలు అందించేందుకు వీలుగా మెదక్‌లో వెల్నెస్ సెంటరు మంజూరు చేయాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉన్న పాలకులు ఈ విషయంలో హామినిచ్చి విస్మరించారని గుర్తుచేశారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వ హయాములో జర్నలిస్టులకు, పెన్షన్‌దారులకు వైద్య సేవలు అందుతాయనే ప్రగాఢ విశ్వాసం వ్యక్తం చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటికైనా మెదక్ జిల్లా కేంద్రములో వెల్నెస్ సెంటరు ఏర్పాటుచేసి జర్నలిస్టులకు, పెన్షన్ దారులకు ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింహ చారి, ప్రెస్ క్లబ్ బాధ్యులు కామాటి కృష్ణ, గోపాల్ గౌడ్, రియాజ్, సంగమేశ్వర, వికాస్, హరినాథ్, సురేందర్ రెడ్డి, బివికే రాజు, ప్రకాష్, నాగరాజు, వెంకట్ గౌడ్, సందీప్, సిద్ధు, రాజా గౌడ్, లక్ష్మణ్, రహమత్ అలీ, గోవర్ధన్, రమేష్, శ్రీకాంత్, నాగరాజు, యూసుఫ్, శేఖర్, కార్తీక్, శ్రీను తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ
నమ్మదగిన తెలుగు దినపత్రిక
మెదక్
1
ఆదివారం | 07 జనవరి 2024 | www.navatelangana.com

పాఠశాలకు వెళ్లాలంటే భయం భయం

నవతెలంగాణ పుల్కల్



పుల్కల్ ఉమ్మడి మండలంలోని విద్యార్థులు విద్యాభ్యాసం కోసం ప్రతిరోజు వందల సంఖ్యలో ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించింది. తమ గ్రామాలకు వచ్చే బస్సులలో మహిళలే అధికంగా ప్రయాణించడంతో తాము తీవ్ర నరకయాతన అనుభవిస్తున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలకు వెళ్లాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుంటున్నామని పేర్కొంటున్నారు. ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందోనని తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం బాగానే ఉన్నా నిత్యం పాఠశాలలు, కళాశాలలకు ఇతర ప్రాంతాలకు వెళ్తున్న విద్యార్థులకు శాపంగా మారింది. కనీసం బస్సు స్టాపులలో కూర్చోవడానికి వసతులు లేక ఇబ్బందులకు గురవుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. స్టేజీల వద్ద కనీసం నీడ లేదంటున్నారు. అరకొర బస్సులలో స్థలం లేకపోవడంతో గంటల తరబడి నిలబడి ప్రయాణించాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. బస్సు తలుపు వద్ద వేలాడుతూ ప్రమాదపుటంచున వెళ్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అర్జీల కట్టలు

- ఉమ్మడి మెదక్ జిల్లాలో 8 లక్షలపైనే దరఖాస్తులు
- ఆరు గ్యారంటీలపై ఎన్నో ఆశలు
- గ్యారంటీ పథకాల్లో లేనివాటికీ, ధరణి, ఇతర సమస్యలపై కూడా వేలల్లో దరఖాస్తులు
- 17 వరకు డేటా ఎంట్రీ
- గడువు ముగిసినా దరఖాస్తులివ్వొచ్చు
- తప్పుల్లేకుండా డేటా ఎంట్రీ: వల్లూరు క్రాంతి

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రజా పాలన కార్యక్రమం ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల కోసం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు గత నెల 28 నుంచి ఈ నెల 6 వరకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గ్రామ, మన్సిపల్ వార్డుల్లో సభలు పెట్టి అభయ హస్తం ఆరు గ్యారంటీ పథకాల కోసం ప్రజల నుంచి దరఖాస్తు చేశారు. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట మూడు జిల్లాల్లోనూ 8 రోజుల పాటు ప్రజా పాలన కొనసాగింది. ప్రతి గ్రామ పంచాయతీ, ప్రతి మున్సిపాలిటీ వారిగా ఎన్ని కుటుంబాలున్నాయో అన్ని కుటుంబాలకు దరఖాస్తు ఫారాలు అందజేశారు. దరఖాస్తులో పేర్కొన్న ఐదు పథకాలతో పాటు ఇతర సమస్యలపై కూడా ప్రజలు పెద్ద ఎత్తున దరకాస్తులు చేసుకున్నారు. ముఖ్యంగా రేషన్‌కార్డుల కోసం తెల్లకాగితంపై దరఖాస్తులిచ్చారు. ధరణీ సమస్యలు, ఇతర సమస్యలపై కూడా ప్రజలు ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్నారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడిన అధికార యంత్రాంగం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి వాటిని ఏ రోజుకారోజు మండల కేంద్రాలకు చేర్చారు. వాటన్నింటినీ ఒక్కొక్కటిగా ప్రత్యేక వెబ్‌సైట్‌లో ఎంట్రీ చేస్తున్నారు.

పది లక్షలు దాటిన దరఖాస్తులు

ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామ, వార్డు సభల్లో లక్షలాది మంది దరఖాస్తు చేశారు. అభయ హస్తం ఆరు గ్యారంటీల్లో ఐదు పథకాల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన దరఖాస్తును అందజేసి అందులో ఏ ఏ పథకాల కింద లబ్ధి కావాల్లో వివరాలు నింపి ఇవ్వాలని ప్రభుత్వం చెప్పింది. ఇందు కోసం ఆయా జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా దరఖాస్తు ఫారాలను ముద్రించి ప్రజలకు అందజేశారు. ఒక్కో గ్రామం, మున్సిపాలిటీల్లో ఎన్ని కుటుంబాలున్నాయో వాటి సంఖ్యకు అనుగుణంగా దరఖాస్తుల్ని ఇచ్చారు. దీంతో ప్రజలు ఏదో ఒక పథకం కింద లబ్ధిపొందేందుకు ఎగబడి దరఖాస్తులు చేశారు. సంగారెడ్డి జిల్లాలో 647 గ్రామ పంచాయతీలు, 199 వార్డులున్నాయి. వీటిల్లో ప్రజా పాలన కార్యక్రమం కింద ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు భరోసా, పింఛన్లు, గ్యాస్ సబ్సిడీ, రూ.2500 ఆర్థిక సహాయం వంటి పథకాల కోసం 383357 దరఖాస్తుల్ని స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 3.88 లక్షల కుటుంబాలుండగా దాదాపు అన్ని కుటుంబాల నుంచి దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తులో పేర్కొన్న ఐదు పథకాలు కాకుండా రేషన్‌కార్డు, రేషన్‌కు సంబంధించిన సమస్యలు, ధరణీ ఇతర సమస్యల గురించి కూడా ప్రజలు దరఖాస్తులు పెట్టుకున్నారు. రేషన్ కార్డుల కోసం 58599 దరఖాస్తుల వచ్చాయి. ధరణికి సంబంధించి కూడా దరఖాస్తులు కూడా బాగానే వచ్చాయి. సిద్దిపేట జిల్లాలో సైతం 3.50 లక్షల దరఖాస్తులు వచ్చాయి. రేషన్‌కార్డుల కోసం 52 వేల దరఖాస్తులు, ధరణీ, ఇతర సమస్యల గురించి మరో రెండు వేల దరఖాస్తుల వరకు వచ్చాయి. మెదక్ జిల్లాలోనూ లక్ష వరకు దరఖాస్తులొచ్చాయి.



స్వీకరించిన దరఖా కట్టల్ని ఆయా మండలాలు, మున్సిపాలిటీల వారిగా భద్రపరిచ్చారు.

17 వరకు డేటా ఎంట్రీ

ప్రజా పాలన కింద స్వీకరించిన దరఖాస్తులన్నింటినీ ప్రత్యేకమైన వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ఆయా మండల, మున్సిపల్ కేంద్రాల్లో డేటా ఎంట్రీ కోసం ప్రత్యేకమైన సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఇప్పటికే గ్రామ, వార్డు సభల్లో స్వీకరించిన దరఖాస్తు కట్టల్ని ఏ ఊరికి ఆ ఊరు, ఏ వార్డుకు ఆ వార్డు చొప్పున భద్రపరిచారు. వాటిని గ్రామ, వార్డుల వారిగా కంప్యూటర్‌లో ఎంట్రీ చేయాలని ప్రభుత్వం ఆవేశించింది. ఈ నెల 17 వరకు దరఖాస్తుల డేటాను పూర్తి స్థాయిలో ఎంట్రీ చేయనున్నారు. గ్రామ, వార్డు సభల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలకు దరఖాస్తుల డేటా ఎంట్రీని కూడా పూర్తి చేసేలా బాధ్యతలు అప్పజెప్పారు. ఒక్కో దరఖాస్తు ఫారానికి ప్రత్యేక మైన నెంబర్ ముద్రించారు. ఆ నెంబర్ ఆధారంగా ఆ కుటుంబం ఏ ఏ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్నారనే వివరాల్ని నమోదు చేస్తారు. ఆ కుటుంబ సభ్యుల ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతా వివరాల్ని కూడా నమోదు చేయనున్నారు. డేటా ఎంట్రీలో ఏలాంటి తప్పిదాలు దొర్లకుండా జాగ్రతలు తీసుకోవాలని మూడు జిల్లాల కలెక్టర్లు పర్యవేక్షిస్తున్నారు. డేటా ఎంట్రీ పూర్తి చేశాక ప్రతి ఒక్క దరఖాస్తు వివరాలు, ఆ కుటుంబ సభ్యుల సమగ్ర సమాచారమంతా కూడా కంప్యూటర్‌లో నమోదు చేయబడుతుంది. దీంతో రాబోయే కాలంలో ప్రభుత్వం మార్గదర్శకాలు నిర్దేశించిన తర్వాత ఎంట్రీ చేసిన డేటా ఆధారంగానే అర్హులెవ్వరనేది గుర్తించే అవకాశముంది.

96 శాతం కుటుంబాల నుంచి దరఖాస్తు

ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉన్న కుటుంబాల సంఖ్య వచ్చిన దరఖాస్తుల సంఖ్యను పరిశీలిస్తే సుమారు 96 శాతం వరకు ఉన్నట్లు చెబుతున్నారు. ఆరు గ్యారంటీలతో పాటు ధరణీ, రేషన్‌కార్డు మంజూరు, పేర్ల నవెూదు, భూ సమస్యలు, ఆర్థిక, ఆరోగ్య, ఉపాధి సమస్యల గురించి కూడా దరఖాస్తులు వచ్చాయి. అంటే ప్రతి కుటుంబం కూడా ఏదో ఒక పథకం ద్వారా లబ్ధిపొందేందుకు వీలుగా దరఖాస్తులు చేశారు. భూములున్న అందరూ రైతు భరోసా కోసం దరఖాస్తు చేశారు. గతంలో పింఛన్లు వస్తున్న అందరితో పాటు కొత్తగా మంజూరీ కోసం కూడా దరఖాస్తు చేశారు. ఇళ్లులేని ఇళ్ల కోసం, స్థలంలేని వాళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేశారు. ముఖ్యంగా ప్రతి నెలా రూ.2500 ఆర్థిక సహాయం అందించే పథకం కోసం అన్ని కుటుంబాల్లోనూ మహిళలున్నందున అందరూ దరఖాస్తు చేశారు. సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు, 200 యూనిట్ల విద్యుత్ కోసం కూడా అన్ని కుటుంబాల నుంచి దరఖాస్తులు వచ్చినట్లు చెబుతున్నారు.

గడువు ముగిసినా దరఖాస్తుల స్వీకరణ

ప్రజా పాలన కార్యక్రమం పేరిట నిర్వహించిన గ్రామ, వార్డు సభలు శనివారంతో ముగిశాయి. ఎక్కువ మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఇంకా ఎవరైనా దరఖాస్తు చేసుకోకపోయినా ఏవైనా తప్పులతో సమర్పించనా సరే వాళ్ల సైతం నిరంతరం దరఖాస్తులు చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. మండల, మున్సిపల్ కేంద్రాల్లో దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందని చెబుతున్నారు. అదే విధంగా ఆరు గ్యారంటీలతో పాటు ఇతర పథకాల కోసం అర్హులనుకున్న వాళ్ల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు ప్రతి నాలుగు నెలలకు ఒకసారి కూడా ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం బావిస్తుంది.

డేటా ఎంట్రీ చేయాలి

డేటా ఎంట్రీలో ఏలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రతలు తీసుకోవాలి. అందు కోసం అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేయాలి. గ్రామ, వార్డు సభల్లో స్వీకరించిన దరఖాస్తుదారులందరికీ రసీదు ఇవ్వబడింది. ప్రతి దరఖాస్తుకు సంబంధించిన పూర్తి వివరాల్ని ఎంట్రీ చేయబడతుంది. అందులో పేర్కొనబడిన వివరాలన్నీ వెబ్‌సైట్‌లో నమోదు చేయడం ద్వారా జిల్లాలోని మొత్తం దరఖాస్తుదారుల సమాచారం వెబ్‌సైట్‌లో పొందుపర్చబడుతుంది. 17 వరకు డేటా ఎంట్రీ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నాం.

- వల్లూరు క్రాంతి, సంగారెడ్డి కలెక్టర్









ప్రజాక్షేత్రంలోకి సర్కార్

రాష్ట్ర వైద్య, ఆరోగ్య మంత్రి దామోదర్ రాజనర్సింహ

నవతెలంగాణ - మెదక్

ప్రజాపాలన పేరిట సర్కారే ప్రజాక్షేత్రంలో వచ్చి సమస్యలను తెలుసుకుంటోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. శనివారం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన అభయహస్తం ఆరు గ్యారెంటీల పథకం ప్రజాపాలనలో చివరి రోజు భాగంగా మెదక్ పట్టణంలోని సాయిబాలాజీ గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన సమావేశానికి మెదక్ శాసన సభ్యులు డా.మైనంపల్లి రోహిత్‌తో కలిసి మంత్రి దామోదర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నెల రోజులకే ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీల అమలుకు మొదటి క్యాబినెట్‌లో చర్చించి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కాంగ్రెస్‌కు ఒక చరిత్ర, ఒక విజన్ ఉందన్నారు. సంక్షేమం అభివృద్దే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. వ్యవస్థ అనేది శాశ్వతమని, దాన్ని పటిష్ట పరిస్తేనే సమాజం బలోపేతం అవుతుందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ రమేశ్, మెదక్ ఆర్డీఓ అంబదాస్ రాజేశ్వర్, ప్రజాపాలన స్పెషల్ అధికారి జయరాజ్, డిపిఆర్ఓ ఏడుకొండలు, తహశీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమీషనర్ జానకి శ్రీరాం, మున్సిపల్ ఛైర్మెన్ చంద్రపాల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు న్యాయవాది జీవన్ రావ్, బొజ్జ పవన్, ఉప్పల రాజేష్, పట్టణ అధ్యక్షులు గూడూరి అంజనేయులు, గూడూరి క్రిష్ణ, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ గంగా నరేందర్, సుప్రబాత్ రావ్, శ్రీనివాస్ చౌదరి, పరుశురాం, హఫీజ్ మొల్సాబ్, సలీం, జ్యోతి క్రిష్ణ, హరిత, రితీష్ కీర్తి, సులోచన, రవీందర్, కౌన్సిలర్లు ఆవారి శేఖర్, లింగం, ఆర్కే శ్రీను, మున్సిపల్ ఆర్పిలు పాల్గొన్నారు.

నవ తెలంగాణ నర్సాపూర్

'అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం. ప్రజల వద్దకు ప్రభుత్వాన్ని తీసుకురావడమే ప్రజాపాలన. రాజకీయాలకతీతంగా అభివృద్ధికి సహకరించాలి. పార్టీలు మారినా వ్యవస్థ మారదు. మెరుగైన విద్య వైద్యంపైనే ప్రభుత్వం దృష్టి పెట్టింది' అని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. శనివారం నర్సాపూర్ మండలం రుస్తుంపేట గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే సునీతారెడ్డి, అదనపు కలెక్టర్ రమేష్‌తో కలిసి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ఆరు గ్యారెంటీ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకాలకు అర్హుల కోసం ప్రజాపాలన కార్యక్రమాన్ని ఈ నెల 6 వరకు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకువచ్చిన 6 గ్యారంటీలకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 99 శాతం దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ జ్యోతి సురేష్ నాయక్ ,జడ్పీటిసి బాబ్యా నాయక్, జిల్లా కోఆప్షన్ సభ్యులు మన్సూర్ ,మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్ ,ఆర్డీవో శ్రీనివాసులు ,డి ఆర్ డి ఓ శ్రీనివాస్ ,తాసిల్దార్ కమలాద్రి ,ఎంపీడీవో మార్టిన్ లూథర్, సిడిపిఓ హేమా భార్గవి ,కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజారెడ్డి ,మెదక్ జిల్లా అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్, వివిధ పార్టీల నాయకులు సుహాసిని రెడ్డి, కరుణాకర్ రెడ్డి ,సురభి వినోద శివ శంకర్ గౌడ్, హంసి బాయ్, కమలాపూల్ సింగ్ ,రవీందర్ రెడ్డి, మల్లేశం ,నరేందర్ రెడ్డి ,నహీముద్దీన్ ,భోగ చంద్రశేఖర్, సత్యం గౌడ్ , గ్రామ సర్పంచ్ విజయ భాస్కర్ రాజు , ఎంపీటీసీ లక్ష్మి అశోక్, పంచాయతీరాజ్ ఏఈ స్వామి దాస్, ఎలక్ట్రిసిటీ ఏఈ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - చేగుంట

ప్రజాస్వామ్యంలో ప్రజలే న్యాయ నిర్ణేతలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. చేగుంట మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలలో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. ఇందులో రెండు అమలు చేశామన్నారు. ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం త్వరలో అమలు కానుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఎంతో అభివృద్ధి సాధించామని అన్నారు. ప్రజా సంక్షేమమే ఎజెండగా కాంగ్రెస్ పనిచేస్తుందన్నారు. అనంతరం అర్హులైన పేదల నుండి మంత్రి దరఖాస్తులు స్వీకరించారు. తమను పర్మినెంట్ చేయాలని కాంట్రాక్ట్ ఆరోగ్య సిబ్బంది, గ్రామ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేగుంట మాజీ ఉపసర్పంచి చిట్టా బోయిన రఘుపతి వినతిపత్రం అందజేశారు. చేగుంటలోని 330 సర్వే నెంబర్లో భూమి కోల్పోయామని, తమకు నష్టపరిహారం అందించాలని తలారి సాధుల్లా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బాధితులకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషాకు మంత్రి సూచించారు. కార్యక్రమంలో జైంట్ కలెక్టర్ రమేష్, జిల్లా పంచాయతీ అధికారి సాయి బాబా, డీఎంహెచ్వో చందు నాయక్, ప్రత్యేక అధికారి జెమల నాయక్, నియోజకవర్గ ఇన్చార్జీలు చెరుకు శ్రీనివాస్ రెడ్డి ,ఆవుల రాజిరెడ్డి, పిసిసి మాజీ సభ్యులు సుబ్రభాతారావు, తాసిల్దార్ గీయా సున్ని స బేగం, ఎంపీడీవో ఆనందమేరి, ఏపిఎం లక్ష్మి నర్సమ్మ పాల్గొన్నారు.

నవతెలంగాణ/తుప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

ప్రజల సమస్యలను తెలుసుకోవడంతో పాటు వాటిని పరిష్కరించేందుకు ప్రజల వద్దకు అధికారులను తీసుకువచ్చి వాటిని తెలుసుకునేందుకే ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించిందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. తూప్రాన్ మున్సిపల్ కేంద్రంలోని 16వ వార్డులో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, గజ్వెల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, అడిషనల్ కలెక్టర్ రమేష్, జడ్పీ సీఈవో వెంకట శైలేష్, ఆర్డీవో జయచంద్రారెడ్డి, తహశీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో అరుంధతి, మున్సిపల్ చైర్మన్ బొంది రాఘవెందర్‌గౌడ్, వైస్ చైర్మన్ శ్రీనివాస్, కౌన్సిలర్లు, కమీషనర్ ఖాజామొహినొద్దీన్ పాల్గొన్నారు.

గత ప్రభుత్వం అప్పులు మిగిల్చింది

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

నవ తెలంగాణ హుస్నాబాద్ రూరల్

గత ప్రభుత్వం ఎన్ని అప్పులు మిగిల్చినా... ప్రజలకు మంచి చేయాలని దృఢ నిశ్చయంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళుతోందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం హుస్నాబాద్‌లోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. ప్రజలనుండి ప్రభుత్వ గ్యారంటీ పథకాలపై దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన నెల రోజులలోనే కాంగ్రెస్ 420 అని బీఆర్ఎస్ నాయకులు విమర్శించడం తగదన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించి ఓటు వేస్తే ఎమ్మెల్యేగా ఎన్నికై రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించానని, హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలను మరవనని ఎల్లప్పుడూ అండగా ఉంటానని అన్నారు. మీకు ఏ సమస్య ఎదురైనా నా దృష్టికి తీసుకువస్తే వెంటనే స్పందించి పరిష్కరించే బాధ్యత నాదన్నారు. ఇప్పటికే రెండు గ్యారెంటీలను అమలు చేశామని అన్నారు. ప్రతి నాలుగు నెలలకు ఒకసారి ప్రజాపాలన కార్యక్రమం ఉంటుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఇప్పటికే 85 వేల అప్లికేషన్లను స్వీకరించామని తెలిపారు. ప్రజాస్వామ్య పునరుద్దరించడానికి హైదరాబాదులో ధర్నా చౌక్‌ను ప్రారంభించామన్నారు. డబుల్ బెడ్ రూమ్ లబ్దిదారులు ఇబ్బంది పడకుండా అవసరమైన రిపేర్లు పూర్తి చేసి అందిస్తామన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టుగానే మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. సీడీఎంఎ బృందం నిన్ననే హుస్నాబాద్‌కు వచ్చి పరిశీలించిందని, గౌరవెల్లి నిర్వాసితులతో దురుసుగా ప్రవర్తించకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రవర్తించి సమస్య పరిష్కరిస్తామన్నారు. రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చించామని, ఇంకా 2 వేల ఎకరాల భూసేకరణ చేసి డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ నిర్మిస్తామన్నారు. దేవాదుల, శ్రీరామ్‌సాగర్, వరద కాలువ ఫేస్ 2 ద్వారా నీళ్లు వచ్చేలా చర్యలు చేపడతామన్నారు. మున్సిపల్ పట్నంలోని హమాలీలకు హెల్త్ ప్రొఫైల్ టెస్ట్ చేపించే అవసరమైన వైద్య సేవలు అందిస్తామన్నారు. నిమ్స్ ఎం.ఎన్.జె తదితర ఆస్పత్రులలో వైద్య సేవల కోసం వస్తే ఒక ప్రత్యేక వ్యక్తిని అందుబాటులో ఉంచి ప్రత్యేకమైన వైద్య సేవలు రాజకీయాలకతీతంగా ఈ ప్రాంతం వారికి చేయిస్తానని చెప్పారు. విద్యా, వైద్యం, గృహవసతి, ఉద్యోగులు, సామాన్య ప్రజలు, రైతుల తదితరులు అందరి సమస్యలు పరిష్కరిస్తానన్నారు. హుస్నాబాద్ నుంచి ఏ ప్రాంతానికైనా బస్ సౌకర్యం కావాలనిపిస్తే నాకు చెప్పండి.. ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు ఎక్కడికి వెళ్లినా గౌరవం పెరిగేలా మీ ఇమేజ్‌ని పెంచుతానని తెలిపారు. కార్యక్రమంలో హుస్నాబాద్ ఆర్డీఓ బెన్ షాలేం, మున్సిపల్ ఛైర్మన్ ఆకుల రజిత,





సింగిల్ విండో ఛైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఏసీపీ సతీష్, మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, కౌన్సిలర్ పద్మ ప్రజాప్రతినిధులు తదితరులు.

నవతెలంగాణ- కోహెడ

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం మండల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన హాజరయ్యారు. అంబేద్కర్ చేరస్తా వరకు ర్యాలీగా చేరుకొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం శ్రీలక్ష్మీ గార్డెన్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య ఆధ్వర్యంలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. గ్రామాలవారీగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీ సంక్షేమ పథకాలను అమలు చేస్తామన్నారు. బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ విజయాన్ని ఓర్చుకోలేకనే ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం ఖజానా మొత్తం ఖాళీ చేసి రూ.ఏడు లక్షల కోట్ల అప్పు చేసిందని ఆరోపించారు. ప్రజాపాలనలో దరఖాస్తులు సైతం ఉచితంగా పంపిణీ చేసిన తీరును బీఆర్ఎస్ ప్రభుత్వం తట్టుకోవడం లేదన్నారు. కాళేశ్వరంలో జరిగిన అవినీతిని సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించడాన్ని ఇతర పార్టీలు జీర్ణించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బస్వరాజు శంకర్, శెట్టి సుధాకర్, బందెల బాలకిషన్, మోహన్ రెడ్డి, వేల్పుల వెంకటస్వామి, చింతకింది శంకర్, దొమ్మాట జగన్ రెడ్డి, ముంజ తిరుపతి, కొంకటి దామోదర్, గూడ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ధర్మకర్తలమండలి ప్రమాణస్వీకారం

నవ తెలంగాణ కొమురవెల్లి



కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ చైర్మన్‌గా పర్పాటకం లక్ష్మారెడ్డిని కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం కొమురవెల్లిలో ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారానికి డీసీసీ జనగామ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, నాగపురి రాజాలింగం హాజరయ్యారు. మల్లన్న ఆలయ ఆవరణలో ఈవో బాలాజీ ఆధ్వర్యంలో ధర్మకర్తలు కొమ్ము రాజేశ్వరి ప్రతిపాదించగా తాళ్లపల్లి రమేష్, తిరుమల నర్సింహులు బలపరచగ అధికారులుఆమోదించారు. అనంతరం పాలక మండలి సభ్యులుగా అంబాల ఉమారాణి, అల్లం శ్రీనివాస్, పయ్యావుల ప్రవీణ్ యాదవ్, బోయిని సాయికుమార్, లింగంపల్లి శ్రీనివాస్, ముస్త్యాల దామోదర్, ఎర్ర బచ్చలి శ్రీనివాస్, మేడికుంట శ్రీనివాస్, తిరుమల నర్సింలు, చీపురు బిక్షపతి, కాయిత మోహన్ రెడ్డి, గడ్డం వీరభద్రప్ప, పత్య శ్రీనివాస్, తాళ్లపల్లి రమేష్, కామిడీ రమణారెడ్డి, చీపిరి కిరణ్ కుమార్ యాదవ్, బండారు మధుసూదన్, కే.అంజయ్య యాదవ్లచే ప్రమాణస్వీకారం చేయించారు. చైర్మన్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఆలయాభివృద్ధి, భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తామన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో అభివృద్ధి చేస్తా

కొమురవెల్లి పాలకమండలి ప్రమాణ స్వీకారానికి హాజరైన కొమ్మూరి ప్రతాపరెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. అనంతరం కమిటీ సభ్యులు అందరితో కలిసి మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాపరెడ్డి కల్యాణ వేదికతో పాటు ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ మల్లన్న ఆలయ అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డిని ఒప్పించి ప్రత్యేక నిధులు తెప్పించి ఆలయ అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటానని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆలయంలో భారీగా అవినీతి జరిగిందని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నూతనంగా ఏర్పాటైన పాలక మండలితో ఆలయంలో అవినీతికి తావు లేకుండా అభివృద్ధితో పాలన చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం. మాజీ సీఎం కెసిఆర్ మల్లన్న ఆలయ అభివృద్ధికి గతంలో ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని, అందుకే వాళ్ల ప్రభుత్వం ఓడిపోయిందని అన్నారు. మాజీ సీఎం కెసిఆర్ మల్లన్న సాగర్ నుండి తపస్పల్లికి రిజర్వాయర్ లోకి నీళ్లు తెప్పిస్తానని అబద్ధపు హామీ ఇచ్చి ఇక్కడి రైతులను మోసం చేశాడని అన్నారు. 27 వేల దొంగ ఓట్లను నమోదు చేయించి గెలిచిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపు ఒక గెలుపేనా అని ఎద్దేవా చేశారు. మద్దూరు జెడ్పిటిసి గిరికొండల్ రెడ్డి, ఎంపీటీసీలు లింగంపల్లి కనకరాజు, కొయ్యడ శ్రీనివాస్, నాయకులు మహదేవుని శ్రీనివాస్, కొమ్ము నర్సింగ రావు, ఉట్లపల్లి శ్రీనివాస్, పుర్మ ఆగం రెడ్డి, దాసరి కళావతి మంచాల చిరంజీవులు, బ్రాహ్మణపల్లి చంద్రం, జంగని రవి, సార్ల లింగం, సనాది భాస్కర్ పాల్గొన్నారు.

ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలి

నవతెలంగాణ-సదాశివపేట



సంగారెడ్డి నియోజకవర్గ, తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఈ నూతన సంవత్సరంలో ఆయురారోగ్యాలతో.. సుఖ సంతోషాలతో ఉండాలని సంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి తెలిపారు. సదాశివపేట మండ లంలోని గొల్లగూడెం గ్రామంలో కాంగ్రెస్ నాయకులు కోల్కూర్ సంగమేశ్వర్ ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ నాయకులుతో కలిసి నూతన క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంద న్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు సిద్దన్న, కొండాపూర్ ఎంపీపీ మనోజ్ రెడ్డి, గ్రామ సీనియర్ నాయకులు నవీన్ కుమార్, మల్లేశం, రాజ్ కుమార్, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముని అక్షింతల శోభాయాత్రలో కార్పొరేటర్ సింధు

నవతెలంగాణ-రామచంద్రాపురం



భారతినగర్ డివిజన్ పరిధిలో శనివారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం నుంచి శ్రీ రామాలయం వరకు నిర్వహించిన అయోధ్య శ్రీ రాముని అక్షింతల వితరణ శోభాయాత్ర కార్యక్రమంలో కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అయోధ్యలో శ్రీరాముని ఆలయ ప్రారంభోత్సవం కోసం హిందూ సంఘాలు ఏకమై వివిధ కార్యక్రమాలు చేపట్టడం సంతోషించదగ్గ విషయమన్నారు. శ్రీరాముని అక్షింతల శోభాయాత్రలో తనను కూడా భాగస్వామ్యం చేసినందుకు సంతోషం వ్యక్తం చేశారు. అంతకుముందు కన్యకా పరమేశ్వరి ఆలయం నూతన క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్



కామారెడ్డి జిల్లా పిట్లం మండలం కుర్తీ గ్రామంలో శనివారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రిని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోల సంజీవరెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి.. పూలబొకే ఇచ్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పండరి రెడ్డి, మాజీ ఎంపీటీసీ, యూత్ కాంగ్రెస్ మాజీ అసెంబ్లీ అధ్యక్షులు రాజు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు శివాజీ, పాటిల్ పాల్గొన్నారు.

సోమన్న జాతర ఏర్పాట్లను పరిశీలించిన కార్పొరేటర్



నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రాపురంలోని శ్రీనివాస్ నగర్ కాలనీ సండే మార్కెట్ వద్ద ఉన్న శ్రీ సోమేశ్వర స్వామి ఆలయంలో జరగనున్న సోమన్న జాతర మరియు కళ్యాణం ఏర్పాట్లను స్థానిక కార్పొరేటర్ పుష్ప శనివారం పరిశీలించారు. ట్రాఫిక్ డిపార్ట్మెంట్, లా అండ్ ఆర్డర్ డిపార్ట్మెంట్ ఎస్ఐలు ప్రదీప్, శశికాంత్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు రాగం రమేష్, బైకన్ నవీన్, రాగం కృష్ణ, రాగం రాంచందర్, వనం కుమార్, రాగం శ్రవణ్, బైకాన్ లక్ష్మీనారాయణ, చాకలి నర్సింహా, వనం చిన్న, మహేష్, ఖాజా, మల్లికార్జున్, వాసుదేవ్, శ్రీను, చంద్రకళ యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రామాలయం భూ కబ్జాపై సర్వే రిపోర్ట్ ఇవ్వండి

నవతెలంగాణ-జిన్నారం



మండల కేంద్రమైన జిన్నారం గ్రామపంచాయతీ పరిధి కోదండ రామస్వామి దేవాలయం భూసర్వే నంబర్ 2 3లో ఉన్న సుమారు 12 ఎకరాల భూమి ఏండ్ల తరబడిగా ఆక్రమణకు గురైన నేపథ్యంలో రిపోర్టు ఇవ్వాలంటూ రెవెన్యూ అధికారులకు స్థానిక నాయకులు శనివారం వినతి పత్రం అందజేశారు. సదరు 12 ఎకరాల్లో ఎవరెవరు ఎంత కబ్జాలో ఉన్నారో సూచించే సర్వే రిపోర్టు ఇవ్వాలంటూ ఆ వినతి పత్రంలో జిన్నారం మండల రెవెన్యూ యంత్రాంగానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంగేటి ప్రతాపరెడ్డి,రమేష్, వెంకటేష్, నీలం వెంకటేష్, మహేష్, సుధాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టోర్నమెంట్ విజయవంతానికి కృషి చేయాలి



నవతెలంగాణ-జహీరాబాద్

టీజర్-50 టోర్నమెంట్‌ను విజయవంతం చేసేందుకు ప్రజలు, జిల్లా వాసులు శాంతియుతంగా కృషి చేయాలని నిర్వహణ కమిటీ అధికార ప్రతినిధి రాములు నేత అన్నారు. స్థానిక బాగా రెడ్డి స్టేడియంలోశనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మైనారిటీ నాయకులు, బీఆర్ఎస్ కోహిర్ మండల మాజీ అధ్యక్షులు మహమ్మద్ ఉమర్ అహ్మద్‌తో కలసి మాట్లాడారు. భారత దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి శాసనసభ్యులు క్రికెట్ టీమ్‌లను తీసుకొని జహీరాబాద్‌లో ఆడేందుకు రావడం ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు. జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన ప్రజలు ఆటలను ఆస్వాదించి సంక్రాంతి పండుగను విజయవంతంగా సంతోషాల మధ్య గడుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నిర్వహణ కమిటీ సభ్యులు విజయ రాథోడ్, మహమ్మద్ మక్షుద్, జుబేర్ ఉమర్ ఫారూఖ్, అసలం ,అబ్దుల్లా సిద్దికి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-జిన్నారం

గత వారం రోజుల నుంచి కొనసా గుతున్న ప్రజా పాలన కార్యక్రమంలో శనివారంతో ముగిసింది. కాగా ఈ కార్య క్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఆరు గ్యారెంటీల కోసం దరఖాస్తు చేసుకున్నారు.



జిన్నారం మండల పరిధిలోని జంగంపేట గ్రామపంచాయతీ పరిధిలో శనివారం నిర్వ హించిన ప్రజా పాలన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంగారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్ హాజరయ్యారు. కార్య క్రమంలో ఎంపీడీవో రాములు, స్థానిక సర్పంచ్ వెంకటయ్య, ఉప సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, జిన్నారం మాజీ ఉప సర్పంచ్ శంకరప్ప, మిషన్ భగీరథ ఏఈ ధరణి, హెచ్ ఇ ఓ బాల్రాజ్, అనురాధ, జిన్నారం పోలీసులు తదితరులు పాల్గొ న్నారు. ప్రజా పనులు భారీగా గ్రామస్తులు దరఖాస్తు చేసుకున్నారు. కాగా జిన్నా రం మండల పరిధిలో శనివారం వరకు నిర్వ హించిన ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా మొత్తం 7213 దరఖాస్తులు మండల వ్యాప్తంగా వచ్చినట్లు ఎంపీడీవో రాములు తెలిపారు. మండలంలో నిర్వ హించిన ప్రజా పాలన కార్యక్రమాన్ని జిన్నారం మండల తాసిల్దార్ రవికుమార్, ఎంపీడీవో రాములు పర్యవేక్షించారు.



జోగిపేట : అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలోని 20వ వార్డులో కౌన్సిలర్ రామావత్ చందర్ నాయక్ ఆధ్వర్యంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించి.. దరఖాస్తులను స్వీకరి ంచారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు యస్. సురేందర్ గౌడ్, రంగా సురేష్, కే. నాగరాజు, కోఆప్షన్ సభ్యులు అల్లే శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల ప్రవీణ్, రాజశేఖర్, సైలాన్, అబ్బాస్ అలీ, అనిల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.



సదాశివపేట : మండలంలోని గొల్లగూడెంలో ఎంపీడీవో పూజ, సర్పంచ్ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో ప్రజల పాలన కార్యక్రమాన్ని శనివారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఆరు గ్యారెంటీల పథకాలకు సంబంధిం చిన దరఖాస్తులను సర్పంచ్ స్వీకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన పేద ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోట యాదమ్మ కృష్ణయ్య, అధికారులు పాల్గొన్నారు.



నారాయణఖేడ్‌రూరల్ : నాగలిగిద్ద మండలంలోని ఔదతపూర్ గ్రామంలో శనివారం ప్రజాపాలన కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ రహీం, పండరి, గ్రామ పార్టీ యువ నాయ కులు సంతోష్ అంబాజీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నర్సింగ్‌రావు పాటిల్, వాడికారే రాజు పాటిల్, జట్టే సంజీ వులు, పండరి, బిరప్పగారి రాజ్‌కుమార్, అధికారులు విఠల్, పంచాయతీ కార్యద ర్శి మహేశ్వరి, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ శిరోమణిలు తదితరులు పాల్గొన్నారు.



జహీరాబాద్ : ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమం కోసమే ప్రజా పాలన కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నట్టు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు నరసిం హారెడ్డి అన్నారు. మండలంలోని దీడిగీ గ్రామంలో శనివారం జరిగిన ప్రజా పాలన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅ తిథిగా పాల్గొని మాట్లాడారు. అర్హులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ వైస్ ఎంపీపీ రాములు, ఎంపీటీసీ హగ్గెళ్ళి రాములు, మాజీ వైస్ చైర్మన్ కాజమియ, అక్బర్ హుస్సేన్, జేమిలొద్దిన్, బర్కథలి సోమప్ప, అధికారులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పద్మశాలీ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్

నవతెలంగాణ-సంగారెడ్డి



తెలంగాణ పద్మశాలీ ఉద్యోగుల సంఘం యొక్క ఉమ్మడి మెదక్ జిల్లా 2024-నూతన సంవత్సర క్యాలెండర్‌ను సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి చేతుల మీదుగా శనివారం ఆవిష్కరించారు. అనంతరం తుమ్మల ప్రసాద్ ఈసీఓ, చింత బలరాం డీఈవో, కస్తూరి వెంకటేశ్వర్లు డీడీ హార్టికల్చర్, జట్ల భాస్కర్, తెలంగాణ పద్మశాలీ ఉద్యోగుల సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులుతో పాటు పలువురు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పద్మశాలీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మామిడాల రవికుమార్, ఉమ్మడి మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరిగే శ్రీనివాస్, కోశాధికారి న్యాలమ్ శివకుమార్, అసోసియేట్ అధ్యక్షులు ఆడేపు ఆంజనేయులు, ఉపాధ్యక్షులు కవి వేణు గోపాల్, కోండి రాజు, సహాయ కార్యదర్శి బిజ్జ ఏకనాథం, కారనిర్వహక కార్యదర్శిలు ముత్యాల సాయిప్రసాద్,వల్లందేశి శివకుమార్, కార్యవర్గ సభ్యులు జిందం వెంకటేశ్వరులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మార్కెట్ కమిటీ చైర్మెన్, డైరెక్టర్‌లు

నవతెలంగాణ-సంగారెడ్డి



సంగారెడ్డి జిల్లా నూతన కలెక్టర్ వల్లూరి క్రాంతిని మార్కెట్ కమిటీ చైర్మెన్, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభూ గౌడ్ అధ్వర్యంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు కలెక్టర్‌కు పుష్ప గుచ్ఛం అందజేసి సత్కరించారు. మార్కెట్ కమిటీ కార్యాలయానికి రావాలని కలెక్టర్‌కు ఆహ్వానించారు. కార్యక్రమంలో డైరెక్టర్‌లు మనీష్ గౌడ్, విజయ లక్ష్మి పరుశురాం, హెరా లాల్, రవీందర్, రాజ మల్లారెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం సభ్యులు

నవతెలంగాణ-సంగారెడ్డి



వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును హైదరాబాద్‌లోని ఆయన ప్రభుత్వ నివాసంలో తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర కార్యవర్గం సభ్యులు నూతన సంవత్సర సందర్భంగా శనివారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వం ద్వారా రైతులకు ఉపయోగపడే విధంగా వ్యవసాయన్ని అభివృద్ధి చేయాలని, అందుకుగాను మార్కెట్ డిమాండ్ అనుగుణంగా పంటల విధానం చేపాట్టి పండించిన ఉత్పత్తులను రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాలకు విదేశాలకు ఎగుమతి చేసే అవకాశాలను వినియోగించుకోవాలని మంత్రికి సూచించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకు రాగా.. సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం చైర్మన్ బి.కృపాకర్ రెడ్డి, అధ్యక్షుడు డి.వైద్యనాథ్, ప్రధాన కార్యదర్శి జి.కృపాకర్ రెడ్డి సంఘ ప్రత్యేక ఆహ్వానితుడు రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, వి.చంద్రమోహన్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాపాలనలో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపల్ పరిధిలో శనివారం ఏర్పాటు చేసిన ప్రజా పాలన కార్యక్రమంలో పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మినీ ఇండియాగా పేరొందిన బొల్లారం మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అర్హులు ఎక్కువ సంఖ్యలో ఉంటారని, ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ రోజా బాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కొలను బాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు చంద్రారెడ్డి, వైస్ చైర్మెన్ అనిల్‌రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడాకారులను జహీరాబాద్‌లో ఆడించడమే లక్ష్యం

- త్వరలో జహీరాబాద్ క్రికెట్ హబ్‌గా మారనుంది
- సామాజిక ఉద్యమకారుడు, బీఆర్ఎస్ నాయకులు మహమ్మద్ ఖీజర్ యాఫై



నవతెలంగాణ-జహీరాబాద్

జాతీయ స్థాయి క్రీడాకారులను జహీరాబాద్‌లో ఆడించడంతో క్రీడాకారుల్లో నూతన ఉత్తేజం వస్తుందని ఖీజర్ యాఫీ గోల్డ్‌కప్ నిర్వాహకులు, సామాజిక ఉద్యమ కారుడు, బీఆర్ఎస్ నాయకులు మహమ్మద్ ఖీజర్ యాఫై అన్నారు. పట్టణ పరిధిలోని బాగారెడ్డి క్రీడా మైదానంలో నేడు(ఆదివారం) ఉదయం 8.30 గంటలకు ఖీజర్ యాఫై గోల్డ్‌కప్-2 అట్టహాసంగా ప్రారంభం అవుతుందన్నారు. స్థానిక మున్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్ సూరి కృష్ణ ప్రారం భిస్తున్నారన్నారు. టౌర్నిలో భాగంగా 16 క్రీడా జట్లు పాల్గొంటాయని, ఇందులో జమ్మూకాశ్మీర్, నిజామాబాద్, అచ్చంపేట్, నాగ్‌పూర్, హైదరాబాద్, కర్ణాటక ప్రముఖ జట్టు, శేకపూర్, ఢిల్లీ, మచిరెడ్డిపల్లి, జహీరాబాద్, తదితర జట్లు పాల్గొంటున్నాయన్నారు. టౌర్ని నాకౌట్ పద్ధతిలో ఉంటుందని, ఇరు జట్లకు 20 ఓవర్ల ఆట ఆడించడం జరుగుతుందన్నారు. రెండు జట్లు సమానంగా పరుగులు చేస్తే విజయం కోసం సూపర్ ఓవర్‌లో మ్యాచ్ ఫలితాన్ని నిర్ణయి స్తామన్నారు. అంతరాష్ట్ర ఆటగాళ్లు పాల్గొనే ఈ టౌర్నీలో ఉత్తర భరతదేశం, ఈశాన్య భారత దేశం ఆటగాళ్లకు నిర్వాహకులు సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. ఖీజర్ యాఫై గోల్డ్ ఫైనల్ విజేత జట్టుకు రూ.5,55,555 నగదుతో పాటు ఆకర్షణీయమైన ట్రోఫీ, ఫైనల్‌లో ఓడిన జట్టుకు రూ.3,33,333 నగదుతో పాటు ఆకర్షణీయమైన ట్రోఫీ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతీ మ్యాచ్‌లో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన ఆటగాడికి రూ.1000 నగదుతో పాటు కప్ ఇవ్వబడుతుందన్నారు. టోర్నీలో ఉత్తమ ప్రదర్శన కనబ ర్చిన ఆటగాడికి రూ.50 వేలతో పాటు ట్రోఫీని అందజేస్తా మన్నారు. గత రెండు పర్యాయాలుగా నిర్వహించిన ఈ టోర్నమెంట్లో వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొ న్నారు. ఈసారి కూడా జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులు జహీరాబాద్ మైదానంలో తమ క్రీడా ప్రభంజనాన్ని చూపించనున్నారని తెలిపారు. ప్రజలు శాంతియుతంగా క్రీడలను ఆస్వాదించి తమ ఆనందాన్ని వ్యక్తం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజా పాలనకు దరఖాస్తుల వెల్లువ

- గడువు ముగిసే నాటికి 11010 దరఖాస్తులు

నవతెలంగాణ-ఝరాసంగం



గత వారం రోజులుగా కొనసాగిన ప్రజా పాలన అభయహస్తం ఆరు గ్యారెంటీల దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసింది. శనివారం మండల పరిధిలోని ఎల్గోయి, పొట్టిపల్లి, ప్యారవరం, బోరేగావ్, బొప్పన్ పల్లి గ్రామాలలో ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాలను నిర్వహించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. గడువు తేదీ ముగిసే నాటికి 11010 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. గడువు చివరి రోజున సుమారు 3000 దరఖాస్తు అందయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సంగీత గుండప్ప, సర్పంచ్ ఓం ప్రకాష్ పాటిల్, సంజీవమ్మ, మండల ప్రత్యేక అధికారి బిక్షపతి, తహసిల్దార్ సంజీవరావు, ఎంపీడీవో సుజాత, సూపరిండెంట్ విట్టోబా, ఎంపీఓ లక్ష్మయ్య, ఏవో వెంకటేష్, ఏపీవో రాజ్‌కుమార్, ఏఎయం బాలకృష్ణ, మండల మైనార్టీ అధ్యక్షులు అజీజ్, నాయకులు సాబేర్, విర్షెట్టి, అంజద్, శంకర్, రామయ్య, పంచాయతీ కార్యదర్శులు, రేషన్ డీలర్లు,పోలీస్ సిబ్బందిపాల్గొన్నారు.

డాకూర్ చెన్నకేశవ ఆలయంలో చోరీ



నవతెలంగాణ-జోగిపేట

అందోల్ మండల పరిధిలోని డాకూర్ గ్రామంలోని చెన్నకేశవ ఆలయంలో గుర్తు తెలియని దుండగులు శుక్రవారం అర్ధరాత్రి దొంగతనానికి పాల్పడ్డారు. ఇందుకు సంబంధించి వివరాలు స్థానికులు, ఆలయ పూజారి తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం గ్రామ సమీపంలోని మాలకుంట కాలువ వద్ద శివుని విగ్రహానికి సంబంధించిన ప్రతిమ పడి ఉండడాన్ని గ్రామస్తులు గమనించారు. దాంతో ఆలయంలోకి వెళ్లి పరిశీలించగా దొంగతనం జరిగినట్టు గుర్తించారు. శివుని విగ్రహాలతో పాటు 30 తులాల వెండి వస్తువులు ఎత్తికెల్లినట్టు గుర్తించారు. ఈ విషయమై పీఏసీఎస్ చైర్మెన్ నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రమేష్ గౌడ్, గ్రామ పెద్దలు మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డిలతో పాటు మరికొంతమంది అక్కడికి చేరుకొని పరిశీలించారు. ఈ విషయాన్ని జోగిపేట పోలీసులకు సమాచారం అందించగా సీఐ నాగరాజు, ఎస్ఐ అరుణ్‌కుమార్‌లు ఘటన స్థలానికి చేరుకొని దొంగతనానికి సంబంధించి వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు. దొంగతనానికి పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

క్వాలిటీ డాటా ఎంట్రీ కావాలి

నవతెలంగాణ-సంగారెడ్డి



ప్రజాపాలన కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులన్నింటనీ పూర్తి పారదర్శకతతో పకడ్బందీగా ఆన్‌లైన్లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులకు ఆదేశించారు. శనివారం మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీవోలు, తహశీల్దార్లు, ఎంపీడీఓలతో ప్రజా పాలన గ్రామ సభల ద్వారా స్వీకరించిన దరఖాస్తుల డేటా ఎంట్రి ప్రక్రియపై టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, డేటా ఎంట్రీ ప్రక్రియ ప్రారంభిం చాలని, క్వాలిటీ డేటా ఎంట్రీ కావాలని, తప్పులు లేకుండా చేయాలని సూచించారు .వెబ్‌సైట్ లాగిన్స్ కేటాయించడం జరిగిందని, ప్రతి ఒక్క దరఖాస్తు ఆన్లైన్లో నమోదు చేయాలని పూర్తి జాగ్రత్తలతో ఎలాంటి తప్పులు లేకుండా డేటా నమోదు చేయించాలని సూచించారు. ప్రతి మున్సిపల్ వార్డు, ప్రతి గ్రామపంచాయతీలో స్వీకరించిన దరఖాస్తులను క్రాస్ చెక్ చేసుకోవాలని, ప్రాపర్‌గా ఎంట్రీ చేయాలన్నారు. సంబంధిత పర్యవేక్షణ అధికారులు బాధ్యతగా డేటా ఎంట్రీ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా పర్యవేక్షించాలన్నారు. డేటా ఎంట్రి పూర్తి కాగానే దరఖాస్తులను జాగ్రత్తగా భద్రపరచాలని సూచించారు. ఇంకా డేటా ఏంట్రీ ప్రారంభించని వారు లాగిన్స్ క్రియేట్ చేయించి ఈరోజు నుండి చేయించాలని సంబంధిత ఎంపీడీఓలకు తెలిపారు. ఎక్కడైనా కంప్యూటర్ సిస్టమ్స్ అవసరం ఉన్నట్లైతే ఆర్డీఓల కోఆర్డినేషన్ తో సమకూర్చు కోవాలని ఎంపీడీవోలకు సూచించారు. నిర్ణీత గడువులోగా దరఖాస్తుల డేటా ఎంట్రీ పూర్తి కావాలని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా పలువురు ఎంపీడీవోలు, మున్సిపల్ కమి షనర్లను ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? ఎంతమంది డేటా ఎంట్రీ ఆపరేటర్లను ఏర్పాటు చేసుకున్నారు? లాగిన్స్ ఇచ్చారా? రోజుకు ఎన్ని పూర్తి చేయాలన్న ప్లానింగ్ చేసుకు న్నారూ? ఇప్పటి వరకు ఎన్ని పూర్తయ్యాయి అంటూ అడగ్గా, ఆయా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు సంబంధిత వివరాలను కలెక్టర్‌కు వివరించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్లు, ప్రత్యేక అధికారులు, ఆర్డీవోలు, ఎంపీడీవోలు, తహసిల్దార్లు పాల్గొన్నారు.

సకాలంలో హామీలు అమలు చేయాలి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

నవతెలంగాణ-అమీన్‌పూర్



ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నిర్దేశించిన గడువులోగా హామీలను అమలు చేయాలని పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సూచించారు. అమీన్‌పూర్ మండలం జానకంపేట గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రతి హామీని నిలబెట్టుకోవాల్సిన గురు తర బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం పై ఉందన్నారు. ఆరు గ్యారెంటీలతోపాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో ప్రకటించిందని గుర్తు చేశారు. వంద రోజుల్లోగా ఆరు గ్యారంటీలని అమలు చేయకపోతే, ప్రజల తరఫున ప్రశ్నించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ పాండు, ప్రజా ప్రతినిధులు, అధికారులు,స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాల అమలు



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

అర్హులందరికీ సంక్షేమ పథకాల అమలు చేస్తామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోల సంజీవ రెడ్డి అన్నారు. నారాయణఖేడ్ పట్టణం, మున్సిపాల్టీ, వివిధ గ్రామాల్లో శనివారం నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించడం కోసమే దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు చెప్పారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఇప్పటికే మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం, ఆరోగ్య శ్రీ అమౌంట్ పెంపుతో రెండు గ్యారెంటీలు అమలవుతున్నాయన్నారు. మిగిలిన నాలుగు గ్యారెంటీలను కూడా త్వరలోనే అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల పార్టీ అని, ప్రజల కోసమే పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి, చైర్మెన్ రూబీన నజీబ్, థాయిర్ అలీ, కౌన్సిల ర్లు, రామకృష్ణ, శంకర్‌సెట్,రమేష్ చౌహన్ తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షాన నిలబడే పత్రిక నవతెలంగాణ

- రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప
- నవతెలంగాణ పత్రిక నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరణ

నవతెలంగాణ-రామచంద్రాపురం



పేద, బడుగు, బలహీన వర్గాల పక్షాన నిలబడుతూ.. పభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలుస్తున్న పత్రిక నవతెలంగాణ దినపత్రిక అని రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నగేష్ అన్నారు. నవతెలంగాణ నూతన సంవత్సర-2024 క్యాలెండర్‌ను రామ చంద్రాపురం పట్టణంలో కార్పొరేటర్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజకీయాలకు, వర్గాలు, మతాలకు అతీతంగా, ఎవరికి పక్షపాతం లేకుండా నిక్కచ్చిగా వార్తలను ప్రచురించడంలో నవతెలంగాణ పత్రిక మొదటి వరుసలో ఉంటుందన్నారు. నవతెలంగాణ దినపత్రిక మరెన్నో శిఖరాలను అధిరోహించి ముందుకు సాగాలని ఈ సందర్భంగా కార్పొరేటర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శశికాంత్, ట్రాఫిక్ ఎస్ఐ ప్రదీప్, రిపోర్టర్ వాసుదేవ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బూరుగడ్డ నగేష్ నాయకులు రాకేష్, సతీష్, నరసింహ, మహేష్, కాజా, మోహన్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

'ఛలో పార్లమెంట్' వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-కంగ్టి

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12న చేనపట్టనున్న 'ఛలో పార్లమెంట్' వాల్ పోస్టర్‌ను కంగ్టి మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కిందిదొడ్డి సతీష్ మాట్లాడుతూ.. నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దుచేయాలని, అందరికి విద్యా, ఉపాధి కల్పించాలని, జాతీయ మెడికల్ టెస్ట్ రద్దు చేయాలనే డిమాండ్‌లతో 12న ఛలో పార్లమెంట్‌కు పిలుపునిచ్చినట్టు చెప్పారు. పసి వయస్సులోనే విద్యార్థుల పాఠ్యపుస్తకాల్లో మతోన్మాద భావజాలాలను జొప్పిస్తూ.. విద్యారంగాన్ని కాషాయీకరణ చేసేలా నూతన విద్యా విధానాన్ని కేంద్రం తీసుకొస్తున్నదన్నారు. జాతీయ ఉద్యమ నాయకుల చరిత్రను తొలిగించి ఉద్యమాలతో సంబంధం లేని గాడ్సే, వీడి సావర్కర్ లాంటి చరిత్రలను పొందుపరుస్తున్నారన్నారు. జాతీయ స్థాయిపోటీ పరీక్షలను ఎన్ఎన్‌టీఏ సంస్థ నిర్వహించడం ద్వారా విద్యార్థులు తీవ్ర నష్టపోయే ప్రమాదమున్నదన్నారు. అలాగే రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.7800కోట్ల ఫీజు రియంబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండలాధ్యక్షులు పవన్, నాయకులు రాజు, అబ్రహం, నందిని, సునీత, రేఖ, రమ్య తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా గ్యాస్ విక్రయాలు

నవతెలంగాణ-సదాశివపేట

సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో గల గ్యాస్ ఏజెన్సీలు ఇష్టానుసారంగా గ్యాస్ అమ్మకాలు చేస్తూ, ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. గతవారం రోజుల నుంచి లారీల సమ్మె ఉన్నదని చెబుతూ.. గ్యాస్ బుకింగ్ చేసినా గ్యాస్ రాలేదని చెబుతూ బయటి అధిక ధరలకు విక్రయి స్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. హెూటళ్లకు, దాబాలకు రూ.100 నుంచి 150 అదనంగా తీసుకుని వారికి సప్లయి చేస్తున్నారన్నారు.ఇంత జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని ప్రజలు తీవ్ర అసహనానికి లోనవుతున్నారు.

ఇంటింటికీ అయోధ్య రామ మందిర అక్షింతల పంపిణీ

నవతెలంగాణ-జిన్నారం



హిందూ జాగృతి సమితి జిన్నారం మండల ఉత్సవ కమిటీ అధ్యక్షులు వడ్ల ఆనంద్ చారి బృందం ఆధ్వర్యంలో అయోధ్య రాముడి అక్షంతలు వితరణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో శనివారం నిర్వహించారు. ఇంటి ంటికి తిరుగుతూ అయోధ్యరమైన అక్షంతలను పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో హిందూ జాగృతి ఉత్సవ సమితి ప్రతినిధులు ఆనంద్, టెంట్ శ్రీనివాస్, బ్రహ్మేంద్ర, నాయకులు ప్రతాప్ రెడ్డి, రాజిరెడ్డి, సుధాకర్, వినోద్ బృందం పాల్గొన్నారు.

ప్రజా పాలన దరఖాస్తులపై సమీక్ష చేపట్టిన డిఎఫ్ఓ

నవతెలంగాణ-పెద్దశంకరంపేట్



మండల కేంద్రమైన పెద్ద శంకరంపేటలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం పేట మండలంలో ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులపై డిఎఫ్ఓ రవిప్రసాద్ పంచాయతీ కార్యదర్శులు డాటా ఎంట్రీ ఆపరేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల పరిధిలోని ఆయా గ్రామాలలో గ్రామాల చొప్పున ఎన్ని దరఖాస్తులు వచ్చాయో అడిగి తెలుసుకున్నారు. డాటా ఎంట్రీ ఆపరేటర్లు దరఖాస్తులను పరిశీలించి ఆన్లైన్ ఎంట్రీ చేయాలన్నారు. లబ్ధిదారుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ డాటా ఎంట్రీ చేయాలని వారికి సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గ్రేసీ బాయ్, ఎంపీడీవో రఫిక్ ఉన్నిసా, ఆర్ఐ శరణప్ప ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు డాటా ఎంట్రీ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ఎంతో దోహదపడతాయి

ఎంఈఓ బుచ్చా నాయక్

నవతెలంగాణ-నర్సాపూర్



విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ఎంతో దోహదపడతాయని మండల విద్యాధికారి బుచ్చా నాయక్ అన్నారు. నర్సాపూర్ పట్టణంలోని డాన్ బాస్కో పాఠశాల వార్షికోత్సవంలో భాగంగా శనివారం పాఠశాల ఆధ్వర్యంలో క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహించి విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఎంఈఓ బుచ్చానాయక్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం డాన్ బాస్కో పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా పాఠశాల యాజమాన్యం క్రీడా దినోత్సవం నిర్వహించి విద్యార్థులకు వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ నర్సిరెడ్డి, ప్రిన్సిపాల్ మేఘన, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన హైవే రోడ్డు పనులు..

వాహనదారుల ఇబ్బందులు

- రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

నవతెలంగాణ-నిజాంపేట





జాతీయ హైవే రోడ్ల పనులకుగాను కేంద్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలను మంజూరు చేయడం జరిగింది. మెదక్ జిల్లా కేంద్రం నుంచి వరంగల్ జిల్లా హసన్ పర్తి వరకు రోడ్డు పనులను కాంట్రాక్టర్లు మొదలు పెట్టారు. కాని మెదక్ జిల్లా నిజాంపేట మండల కేంద్రంలో పనులను మాత్రం నిలిపివేయడం జరిగింది. నిత్యం వందల సంఖ్యలో తిరిగే వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు గ్రామస్తులు వాపోతున్నారు. రోడ్డు పక్కన డ్రైనేజీ కట్టి అక్కడక్కడ విడిచిపెట్టారు. అందులో మురికి నీరు చేరి దుర్గంధం వాసనతో ఇండ్లలో నివసించే వారికి దుర్వాసన రావడంతో పిల్లలు, పెద్దలకు విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఈగలు దోమలు ఇండ్లలోకి వ్యాపిస్తున్నాయని పేర్కొన్నారు . ఆటోలు, ద్విచక్ర వాహనదారులు, డీసీఎంలు, కార్లు, ట్రాక్టర్లు, రోడ్లపై ఎక్కడ పెట్టాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. మండల కేంద్రంలో రోడ్డు పనులు చేసినట్లయితే ఇబ్బందులు తొలుగుతాయని పలువురు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి వెంటనే నిజాంపేట మండల కేంద్రంలో హైవే రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలి

బైండ్ల భూపాల్, చల్మెడ నివాసి



మెదక్ నుంచి వరంగల్ వెళ్లే రోడ్డు మార్గం నిత్యం వందల కొద్ది వాహనాలు నడుస్తు న్నందున కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారులను మంజూరు చేయడం జరిగింది. రోడ్డు పనులు చకచకా జరుగుతున్నప్పటికీ నిజాంపేట మండల కేంద్రంలో మాత్రం జరగడంలేదని , డ్రైనేజీ పూర్తి చేయకుండా అక్కడక్కడ విడిచిపెట్టడంతో మురుగునీరు చేరి దుర్వాసన భరించలేక పోతున్నాము. ఈగలు, దోమలు కుట్టడం వల్ల చిన్నపిల్లలు రోగాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ, రోడ్డు పనులను పూర్తి చేసి వాహనదారుల ఇబ్బందులను తొలగించాలి.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్



నవతెలంగాణ-మెదక్ టౌన్

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న శరత్ రెడ్డికి శ్రీ రామానంద తీర్థ మరాఠ్వాడ యూనివర్సిటీ నాందేడ్ డాక్టరేట్‌ను ప్రధానం చేసినట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్ తెలిపారు. ప్రొఫెసర్ హర్షా వాలే పర్యవేక్షణలో టెక్నాలజీ ఎనేబుల్డ్ బ్యాంకింగ్ సర్వీసెస్ ఇన్ ఇండియా-ఎ స్టడీ ఆన్ సెలెక్టెడ్ కమర్షియల్ బ్యాంక్స్ ఇన్ నాందేడ్ అండ్ నిజామాబాద్ డిస్ట్రిక్స్ అను అంశం మీద చేసిన ఈ పరిశోధనకు మరాఠ్వాడ విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రధానం చేసిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపక సిబ్బంది డాక్టర్ శరత్ రెడ్డిని ఘనంగా సన్మానించారు.

అక్రమ వెంచర్‌పై కమిషనర్‌కు ఫిర్యాదు

నవతెలంగాణ-నర్సాపూర్



నర్సాపూర్ పట్టణంలో ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు అక్రమంగా వెంచర్‌ను ఏర్పాటు చేస్తున్నారని, వెంటనే ఆ వెంచర్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం బీజేపీ కౌన్సిలర్ సంఘసాని సురేష్, బీజేపీ పట్టణ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్‌లు నర్సాపూర్ మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొందరు బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్‌ను ఏర్పాటు చేసి ప్లాట్లను అమ్ముకుంటున్నారని ఆరోపించారు. అదేవిధంగా ఆ వెంచర్‌లో ప్రభుత్వ అసైన్డ్ భూమి ఉందని వారు తెలిపారు. అక్రమ వెంచర్‌ను ఏర్పాటు చేస్తున్న వారిపై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమిని కాపాడాలని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల సాధన కోసం కృషి

ఎస్టీయు క్యాలెండర్ ఆవిష్కరించిన ఉపాధ్యాయులు

ఎస్టీయు అదనపు కార్యదర్శి నరేష్



నవతెలంగాణ-చిలిపిచేడ్

ఉపాధ్యాయుల సమస్యల సాధన కోసం ఎస్టీయు నిరంతరం కృషి చేస్తుందని మెదక్ జిల్లా ఎస్టీయు జిల్లా అదనపు కార్యదర్శి నరేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని చిలిపిచేడ్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో క్యాలెండర్‌ను చిలిపిచెడు జెడ్పీహెచ్ఎస్ ప్రధాన ఉపాధ్యాయురాలు వేదశ్రీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. అనంతరం ఎస్టీయూ జిల్లా అదనపు కార్యదర్శి నరేష్ మాట్లాడుతూ పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల సేవలను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వెంకట కృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి మహేష్, కోశాధికారి నవీన్ ఉపాధ్యాయులు రమేష్, రుక్మిణి, బాల్సింగ్ లు పాల్గొన్నారు

వికాసిత్ భారత్ సంకల్పయాత్ర



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని నందిగామ, చల్మెడ గ్రామాలలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో వికాసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు హాజరై కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి నోడల్ అధికారి భాస్కర్, డిస్ట్రిక్ట్ ఇంచార్జి సిహెచ్ శ్రీనివాస్, టి శ్రీనివాస్ గౌడ్, మండల జెడ్పిటిసి పంజా విజయ్ కుమార్, చల్మెడ సర్పంచ్ నరసింహారెడ్డి, ఎంపీటీసీ బాల్ రెడ్డి, ఉప సర్పంచ్ తుమ్మల రమేష్, సెక్రటరీ నరసింహారెడ్డి, జీపి స్వామి, నందిగామ గ్రామ సర్పంచ్ లద్ద ప్రీతి రాజగోపాల్, ఎంపీటీసీ లద్ద సురేష్, పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ హారీఫ్ హుస్సేన్, ఆకుల రమేష్, స్కూల్ హెచ్ఎం, హెల్త్ సూపర్వైజర్, ఎన్ఆర్ఈజీఎస్ టిఏ-ఎఫ్ ఏ ప్రేమలత , అంగన్వాడీ టీచర్స్, అగ్రికల్చర్ ఏఈఓ కావేరి గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజా పాలనలో ప్రోటోకాల్ పాటించలేదు

అధికారులపై బీఆర్ఎస్ నేతల ఆగ్రహం



నవతెలంగాణ-చేగుంట

మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో చివరి రోజు శనివారం జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో జిల్లా అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని బీఆర్ఎస్ నాయకులు అధికారులను నిలదీశారు. అధికారులు నియంతలా వ్యవహరించారని బీఆర్ఎస్ నాయకులు మండల ప్రత్యేక అధికారి జెమ్లు నాయక్‌ను నిలదీశారు. దుబ్బాక నియోజకవర్గం ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఫోటో ఫ్లెక్సీలో లేదని పట్టణ అధ్యక్షులు ఎర్ర యాదగిరి, టెలికం బోర్డు మెంబర్ సోమ సత్యనారాయణ, జిల్లా ఏకలవ్య సంఘం అధ్యక్షులు కూర లక్ష్మీనారాయణలు అదికారులను నిలదీశారు. ఇలా అవమానపరచడం సరైనది కాదని, కచ్చితంగా ప్రోటోకాల్ పాటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సోమ వెంకటి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-బెజ్జంకి



మండల పరిధిలోని బేగంపేట గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ గుండా ఎల్లారెడ్డి ఇటీవల ఆనారోగ్యంతో మృతి చెందిన విషయం విధితమే. శనివారం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అయన వెంట మండలాధ్యక్షుడు ముక్కీస రత్నాకర్ రెడ్డి, రెండో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, గ్రామ నాయకులు ఉన్నారు.

కారు బాధితులను పరామర్శించిన దుబ్బాక ఎమ్మెల్యే



నవతెలంగాణ-చేగుంట

కారు దాడిలో గాయపడిన పెళ్లి బృందం సభ్యులను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి శనివారం పరామర్శించారు. చేగుంట మండల పరిధిలోని రెడ్డిపల్లి వడ్డెర కాలనీకి చెందిన ఉప్పు స్వామి కుమార్తె వివాహం సందర్భంగా ఉప్పు నరేందర్ తన మహేంద్ర తార్ వాహనంతో బీభత్సం సృష్టించగా పలువురు గాయపడగా ఉప్పు రమ్య అనే యువతి మృతి చెందింది. విషయం తెలుసుకున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి శనివారం రెడ్డిపల్లి వడ్డెర కాలనీకి చేరుకొని మృతి చెందిన రమ్య కుటుంబ సభ్యులను, అదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఉప్పు యాదగిరిని పరామర్శించారు. పెళ్లి బృందంపై విచక్షణారహితంగా నరేందర్ అనే వ్యక్తి కారుతో బీభత్సం సృష్టించడం ధారుణమన్నారు. అతన్ని వెంటనే అదుపులోకి తీసుకొని కఠినంగా శిక్షించే విధంగా పోలీస్ అధికారులను ఆదేశిస్తానన్నారు. మృతి చెందిన రమ్య కుటుంబ సభ్యులతోపాటు గాయపడిన ఇతర కుటుంబ సభ్యులకు సైతం తాను అండగా ఉంటానన్నారు. వైద్యపరంగా ఆదుకుంటానని వారికి హామీ ఇచ్చారు. అనంతరం పోలీస్ అధికారులతో పెళ్లి బృందంపై దాడి విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. నార్సింగి మండల కేంద్రంలోని చారి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రమాద బాధితులను సైతం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్ హర్షవర్ధన్‌తో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాసుల శ్రీనివాస్, జెడ్పీటీసీ శ్రీనివాస్, జిల్లా సీనియర్ నాయకులు రంగయ్యగారి రాజిరెడ్డి,



ఇబ్రహీంపూర్ సొసైటీ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ రాజగోపాల్, మాజీ ఎంపీటీసీ రామారావు, రెడ్డిపల్లి మాజీ ఉపసర్పంచ్ భోయిని నర్సింలు, రాజిరెడ్డి, సుభాష్ రెడ్డి, స్వామి, రాములు, రామారావు, జగతి, భీమ్రావుపల్లి వార్డు సభ్యుడు బోయిని భూషణం, తదితరులు పాల్గొన్నారు.

అక్రమార్కులు తీరు మార్చుకోవాలి

- శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే ఊరుకునేది లేదు
- గంజాయి, మత్తు పదార్థాలపై ఉక్కుపాదం
- ప్రజలకు ఏ సమస్య ఉన్నా నేరుగా కలవొచ్చు
- బాధ్యతలు చేపట్టిన రోజే ఎస్పీ బాలస్వామి వార్నింగ్





నవతెలంగాణ-మెదక్



అక్రమార్కులు తీరు మార్చుకోవాలని, శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే ఊరుకునేది లేదని, జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ బి.బాలస్వామి బాధ్యతలు స్వీకరించిన తొలి రోజే హెచ్చరించారు. శనివారం మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నూతన ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ బి.బాలస్వామిని జిల్లా అదనపు ఎస్పి అడ్మిన్ ఎస్.మహేందర్ పుష్పగుచ్చం ఇచ్చి సాదరంగా ఆహ్వానించారు. 2018 ఐపీఎస్ బ్యాచ్‌కి చెందిన డాక్టర్ బాలస్వామి కాగజ్ నగర్‌లో ఇన్చార్జి ఎస్‌డీపీఓగా పనిచేసి అక్కడి నుంచి 20-11-2021లో మెదక్ జిల్లా అదనపు ఎస్పి అడ్మిన్‌గా పనిచేయడం జరిగింది. మెదక్ నుంచి రాచకొండ కమిషనరేట్‌లో ఎస్పి డిసిపిగా పని చేశారు. అక్కడి నుంచి సౌత్ వెస్ట్ జోన్ హైదరబాద్ సిటి డిసిపిగా పనిచేసి ప్రస్తుతం మెదక్ జిల్లా ఎస్పిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ జిల్లాలో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే తమ పద్ధతులను మార్చుకోవాలని, లేదంటే చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయన్నారు. ప్రజల శాంతి భద్రతలకు ఎవరైనా భంగం కలిగించాలని చూస్తే ఉరుకునేది లేదని హెచ్చరించారు. జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాలు, అక్రమ కార్యకలాపాలు, రోడ్డు ప్రమాదాలు మొదలైన వాటి పై ప్రత్యేక దృష్టి పెట్టి ఉక్కుపాదం మోపుతామన్నారు. తరచుగా నేరాలు చేసే వారు తమ పద్ధతి మార్చుకొని సమాజంలో మంచిగా బతకాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వివిధ రకాల అభ్యర్థనలు, ఫిర్యాదులు, సమాచారం, సహాయం కోసం వచ్చే ప్రతి ఒక్కరిని మర్యాదపూర్వకంగా ఆహ్వానించి తగు సేవలు అందించడంలో ముందుండాలన్నారు. ప్రజలందరికీ పోలీస్ వ్యవస్థపై నమ్మకం, విశ్వాసం కలిగేలా విధులు నిర్వహించాలన్నారు. బాధితులతో మర్యాద పూర్వకంగా, స్నేహపూర్వకంగా వ్యవహరించాలని పోలీసులకు సూచించారు. ప్రజల సేవ కోసం తాను ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని, ప్రజలకు ఏ సమస్య ఉన్నా తనను నేరుగా కలవవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాకు వచ్చిన నూతన ఎస్పీ డాక్టర్ బాలస్వామిని మెదక్ సబ్ డివిజన్ డీఎస్పీ ఫణీంద్ర, తూప్రాన్ సబ్ డివిజన్ డిఎస్పి యాదగిరి రెడ్డి, డిసిఆర్బి డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, సైబర్ సెల్ డిఎస్పి ఎస్ఆర్ సుభాష్ చంద్ర భోస్, ఏఆర్ డిఎస్పి ఎస్ఆర్ రంగ నాయక్, జిల్లా సిఐలు, ఆర్ఐలు, ఎస్ఐ లు, ఏఆర్ ఎస్ఐలు, డిపిఓ సిబ్బంది కలిశారు.

పోలీసులకు సవాల్‌గా మారిన వరుస చోరీలు

ఆలయాలు, వ్యవసాయ బోర్ల కేబుల్ వైర్లే టార్గెట్

దుంపలకుంట చౌరస్తాలో వరుసగా దొంగతనాలు

నవతెలంగాణ- కొల్చారం



వరుస చోరీలు పోలీసులకు సవాల్‌గా మారిందని చెప్పుకోవచ్చు. గత పది రోజుల క్రితం దుంపలకుంట చౌరస్తాలోని ఎల్లమ్మ ఆలయంలో హుండీ చోరీ జరుగగా తాజాగా అదే ప్రాంతంలోని సేవాలాల్ దేవాలయంలో రూ. 50 వేలు విలువ గల సౌండ్ సిస్టం ఎంపీల్ వైర్ శనివారం చోరీకి గురైంది. ఇంతలోనే పైతర గ్రామ శివారులోని వ్యవసాయ బోరు మోటర్ల వద్ద భారీ మొత్తంలో కేబుల్ వైర్లు చివరికి గురైంది. వరుస చోరీలతో పరిసర గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. చోరీలు జరిగిన ప్రాంతాల్లో పోలీసులు క్షేత్రస్థాయి పరిశీలన చేసినప్పటికీ ఎవరనేది తేలకపోవడం చర్చనీయాంశంగా మారింది. అంతేకాకుండా దుంపలకుంట చౌరస్తాను దుండగులు ప్రధాన అడ్డగా ఎంచుకొని ఇదే ప్రాంతంలో చాలా చోట్ల వరుస చోరీలు జరగడం పోలీసులకు సవాలుగా మారింది. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు వరుస చోరీలపై ప్రత్యేక నిఘా ఉంచాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మురళీధర్ యాదవ్‌పై చేసిన ఆరోపణలు అవాస్తవం



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీధర్ యాదవ్‌పై బీఆర్ఎస్ కౌన్సిలర్లు చేసిన ఆరోపణలు అవాస్తవమని బీజేపీ కౌన్సిలర్లు తీవ్రంగా ఖండించారు. శనివారం వారు మున్సిపల్ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ కౌన్సిలర్లు గోడ రాజేందర్, బుచ్చేస్ యాదవ్, సంఘసాని సురేష్ , యాదగిరి , లతా రమేష్ యాదవ్‌లు మాట్లాడుతూ నర్సాపూర్ పట్టణాన్ని అభివృద్ధి చేయకపోతే 25 సంవత్సరాలుగా మురళీధర్ యాదవ్‌ను పట్టణ ప్రజలు ఎలా ఆదరించారో చెప్పాలన్నారు. మురళీధర్ యాదవ్ బీఆర్ఎస్‌లో ఉన్న సమయంలో ఎందుకు ఆరోపణలు చేయలేదని, బీజేపీ పార్టీలోకి వచ్చిన తర్వాత ఈ విధంగా అవినీతి ఆరోపణలు చేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఈ విధంగా ఆరోపణలు చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆంజనేయులు గౌడ్, ఆశన్నగారి దేవేందర్ యాదవ్, రామిరెడ్డి నీరుడు చంద్రయ్య, రియాజ్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సృజనాత్మకతను వెలికి తీయడంలో

సెయింట్ ఆన్స్ కృషి అభినందనీయం

ఎంఈఓ వెంకట నరసింహులు

నవతెలంగాణ-సంగారెడ్డి



విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడంలో సెయింట్ ఆన్స్ కృషి అభినందనీయమని ఎంఈఓ వెంకట నరసింహులు అన్నారు. శనివారం సెయింట్ ఆన్స్ పాఠశాలలో ఎస్ఎల్ సి కార్యక్రమం కనుల పండుగగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ వెంకటేశ్వర్లు, బీవీఎం ప్రధానోపాధ్యాయులు లింగాగౌడ్, పాఠశాల కరస్పాండెంట్ కే. ఆంథోని రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకట నరసింహులు మాట్లాడుతూ విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడం కోసం ఎస్ఎల్ సి ప్రోగ్రాం నిర్వహించడం అభినందనీయమన్నారు. లింగా గౌడ్ మాట్లాడుతూ విద్యార్థిదశల్లో శక్తి సామర్థ్యాలను తెలుసుకొని వాటిపై దృష్టి సాధించాలన్నారు. పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర అవసరమని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ కే.ఆంథోనీ రెడ్డి మాట్లాడుతూ ఎస్ఎల్ సి కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన పలు విషయాలకు సంబంధించిన నమూనాలను తిలకించడానికి వచ్చిన తల్లిదండ్రుల సందేహాలను విద్యార్థులు నివృత్తి చేసిన విధానం పలువురిని ఆకర్షించిందన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయ బృందానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసిన నవీన్ గుప్తా

నవతెలంగాణ-నర్సాపూర్



రుస్తుంపేట గ్రామానికి వచ్చిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను శివంపేట కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు పులిమామిడి నవీన్ గుప్తా శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ్మకు పుష్పగుచ్చాలు అందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు షేక్ అలీ తదితరులు ఉన్నారు.

తప్పులు లేని ఓటర్ జాబితా తయారీకి సహకరించాలి

నవతెలంగాణ - సిద్దిపేట



తప్పులు లేని ఓటరు జాబితా తయారీకి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఆర్ డి ఓ రమేష్ బాబు అన్నారు. శనివారం ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ సమావేశం ఆర్డిఓ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ జాబితా తయారీకి ప్రతి రాజకీయ పార్టీ నుండి సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు మోహన్ లాల్, బిజేపి నాయకులు పాతూరి శ్రీనివాస్ రెడ్డి, సిపిఐ నాయకులు బన్సిలాల్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు అత్తు ఇమమ్ముద్దీన్ , బీఎస్పీ నాయకులు ఉమేష్ లు పాల్గొన్నారు.

ఆదివారం 07 జనవరి 2024 www.navatelangana.com

అయోధ్య శ్రీరాముని కోసం శ్రీరామరక్ష స్తోత్రం

నవతెలంగాణ-గజ్వేల్



అయోధ్య శ్రీరాముని ప్రాణ ప్రతిష్టలో భాగంగా శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ ఆధ్వర్యంలో 108 మంది భక్తులచే శ్రీరామరక్ష స్తోత్ర పారాయణ మహాయజ్ఞం కృష్ణాలయంలోని రామాలయంలో నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించిన కరపత్రాలను శనివారం సంస్థ అధ్యక్షులు రామకోటి రామరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు రామకోటి రామరాజు మాట్లాడుతూ కోట్లాది హిందువుల కళ నెరవేరే సమయం ఆసన్నమైనదన్నారు. ఈ శుభ దినాన్ని పురస్కరించుకుని ఆదివారం 108 మంది భక్తులచే శ్రీరామరక్ష స్తోత్ర పారాయణ మహాయజ్ఞానికి శ్రీకారం చుట్టామన్నారు. రామాలయంలో జరిగే ఈ పారాయణ మహాయజ్ఞం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు జరుగుతుందని, భక్తులందరు పాల్గొనాలని కోరారు. కృష్ణాలయం అధ్యక్షులు ఎలగందుల రామచంద్ర, ఉప్పల వెంకటేశం, దూబకుంట మైత్రాములు, అత్తెల్లి లక్ష్మయ్య, అంతునూరి శివకుమార్, దొంతుల దశరథం, ధార రాంచంద్రం, నేతి నాగేంద్రం, కరాటే కృష్ణ పాల్గొన్నారు.

అవిశ్వాసం అవాస్తవం

- మున్సిపల్ చైర్‌పర్సన్ అవినీతిపై చర్చకు సిద్ధం
- అవినీతి నిరూపించకుంటే జైలుకు సిద్ధమా?
- కాంగ్రెస్ నాయకులకు మున్సిపల్ కౌన్సిల్ సవాల్

నవతెలంగాణ-సిద్దిపేట

మీడియాలో కథనాలు అవాస్తవమని, మున్సిపల్ చైర్ పర్సన్‌పై అవిశ్వాస వార్తలు వాసంకాదని, బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు ఖండించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు నివాసం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పట్టణ పార్టీ అధ్యక్షులు కొండం సంపత్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు మున్సిపల్ కౌన్సిలర్స్‌తో కల్సి మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం పెడుతున్నట్లు వస్తున్న వార్తలు, కాంగ్రెస్ పార్టీ చేసిన ఆరోపణలు అవాస్తవం అని అన్నారు. మున్సిపల్ మీద జరుగుతున్న కుట్ర అని, నిరాదరనమైన ఆరోపణలు చేసి ప్రజల దృష్టి మరల్చే ప్రయత్నాలు కాంగ్రెస్ నాయకులు చేస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ కౌన్సిల్‌కు చైర్మన్ పెద్దన్న లాంటి వాడు అని, అలాంటి వ్యక్తిపై అవిశ్వాసం పెట్టే అవసరం మాకు లేదన్నారు. సిద్దిపేటలో ప్రభుత్వం లేనప్పుడు కూడా గులాబీ జెండానే మున్సిపల్ మీద ఎగరేశామని, ప్రభుత్వంతో సంబంధం లేకుండా హరీశ్‌రావు మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. కొంతమంది కౌన్సిలర్స్ డిసెంబర్ 31న వేడుకల కోసం హైదరాబాద్ వెళ్తితే అవిశ్వాస తీర్మానంపై చర్చ అని దుష్ప్రచారం చేశారన్నారు. ఇటీవల హరీష్‌రావుకి శుభాకాంక్షలు చెప్పేందుకు వెళ్లిన క్రమంలో అదే రోజు సాయంత్రం వారు వ్యక్తి గతంగా పార్టీ చేసుకున్నారని, దానిపై కొన్ని పత్రికల్లో అవాస్తవమైన కథనాలు వచ్చాయన్నారు. నిన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు మీడియా ద్వారా మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం పెడతాం, మాతో 20మంది టచ్ లో ఉన్నారని ఆరోపణలు చేశారని, అది నిరధారణ ఆరోపణ అని అన్నారు. మేము అందరం పార్టీ కి విధేయులం, మా నాయకుడు హరీశ్‌రావుకు విశ్వాస పాత్రులమని తేల్చి చెప్పారు. చైర్మన్‌పై అవినీతి ఆరోపణలు నిజం కాదని, అవినీతిపై చర్చకు సిద్ధమన్నారు. దమ్ముంటే అవినీతి నిరూపించాలని, లేనిపక్షంలో జైలు కు సిద్ధం కావాలని కాంగ్రెస్ నాయకులకు మున్సిపల్ వైస్ చైర్మన్ సవాల్ విసిరారు. స్వచ్ఛత అవార్డు



రావడం సంతోషంగా ఉందని, స్వచ్ సర్వేక్షన్ అవార్డు సమష్టి కృషికి నిదర్శనమని అన్నారు. ఈ నెల 11 ఢిల్లీలో మున్సిపల్ చైర్మన్ అవార్డు అందుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్స్ బ్రహ్మం, ప్రవీణ్, నాయకం లక్ష్మణ్, గ్యాదరి రవీందర్, సుందర్, డా. విఠోభ, సద్ది నాగరాజు, నాయిని చంద్రం, తాడూరి సాయిశ్వర్, వడ్ల కొండ సాయి, ఎడ్ల అరవింద్ రెడ్డి, రెడ్డి విజేందర్ రెడ్డి, కలకుంట్ల మల్లి ఖార్జున్, యోగి, పస్కుల సతీష్, అనగోని వినోద్ గౌడ్, కో ఆప్షన్ సభ్యులు మేర సత్తయ్య, సైయిద్, నాయకులు అత్తర్ పటేల్, వరాల సురేష్, వజీర్, పయ్యావుల ఎల్లం యాదవ్, బందారం రాజు, బింగి రాజేశమ్, శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, నాగరాజు, మోహిజ్, వంగ తిరుమల్ రెడ్డి, కాటం రఘు రామ్, అలకుంట మహేందర్, భూంపల్లి శ్రీహరి, పాతురి శ్రీనివాస్ రెడ్డి, ఉదర మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

లాభాలు వచ్చే పంటలను సాగు చేయాలి



నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని అంగడి కిష్టాపూర్ గ్రామంలో సాగు చేస్తున్న డ్రాగన్ పండ్ల తోటను మండల వ్యవసాయాధికారి డా.టి.నాగేందర్ రెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాంప్రదాయ పంటలనే కాకుండా అధిక లాభాలు వచ్చే డ్రాగన్ ఫ్రూట్, ఎండుమిరప, బొప్పాయి, స్వీట్ కార్న్, పందిరి కూరగాయలను సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయని రైతులకు సూచించారు. వాణిజ్య పంటలు సాగు చేస్తున్నప్పుడు ఎత్తయిన బెడ్లు వేసుకొని మల్చింగ్ షీటు, డ్రిప్ ద్వారా సాగు చేయాలని రైతులకు సూచించారు. మనకు వంటిమామిడి కూరగాయల మార్కెట్ అందుబాటులో ఉంది కనుక మంచి లాభాలు రావడానికి అవకాశం ఉందన్నారు. రైతులు వరి, మొక్కజొన్న వంటి పంటలు సాగు చేయడం వల్ల ఆశించిన మేరకు లాభాలు రావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి విష్ణువర్ధన్ రైతులు తదితరులున్నారు.

బినామీ పేర్లతో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల స్వాహా

- డీసీసీ జనరల్ సెక్రెటరీ మీసం నాగరాజు యాదవ్

నవ తెలంగాణ - సిద్దిపేట

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావ్ అనుచరులు సిద్దిపేటలో డబ్బుల్ బెడ్ రూమ్ ఇండ్లను స్వాహా చేసారని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజ్ యాదవ్ ఆరోపించారు. శనివారం ఆయన మాట్లాడుతూ గతంలో సిద్దిపేట పట్టణంలో ప్రభుత్వం పేదల కోసం నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లను పేద ప్రజలకు పంపిణీ చేయకుండా, వారి బినామీల పేరు మీద సుమారు 650కు పైగా ఇండ్లను స్వాహా చేశారన్నారు. 200కుపైగా డబల్ బెడ్ రూంలను ఎందుకు ఇంత కాలం పంపిణీ చేయకుండా నిరుపయోగంగా ఉంచారాని మండిపడ్డారు. డబల్ బెడ్ రూంలు బినామీల పేర్లతో స్వాహా చేసిన విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, మంత్రులు దామోదరా రాజానర్సింహ, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖలకు ఫిర్యాదు చేస్తామన్నారు. స్వాహా చేసిన డబల్ బెడ్ రూంలను స్వాధీనం చేసుకొని ఇందిరమ్మ ఇండ్ల పేరుతో పేదలకు పంపిణీ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మీసం మహేందర్ యాదవ్, సందబోయిన పర్శరం, బత్తిని గణేష్, ఉడుత ప్రశాంత్, నాయకులు మహేందర్, కోరిమి రాజు తదితరులు పాల్గొన్నారు.



టీపీటీఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

నవతెలంగాణ-దౌల్తాబాద్

టీపీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో 2024 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని దౌల్తాబాద్ మండల పరిధిలోని ఇందుప్రియాల్ కాంప్లెక్స్ పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ఇందుప్రియాల్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు మహమ్మద్ అఫ్జల్ హుస్సేన్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలుగా మంచి విద్యార్థులను తయారు చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. టీపిటీఎఫ్ భాధ్యతలకు నిలబడు అనే మోటోతో ఉండడం హర్షణీయమన్నారు. మండల అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్, యాదయ్యలు మాట్లాడుతూ 2024 సంవత్సరాన్ని సమస్యల సాధనా సంవత్సరంగా టీపిటీఎఫ్ భావిస్తుందన్నారు. సి.పి.యస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి బదిలీలు ప్రమోషన్ ప్రక్రియ ప్రారంభించాలని, కోర్టు సమస్యలన్నింటికి పరిష్కార మార్గం ఆలోచించాలని, దీర్ఘ కాలికంగా పెండింగులో వున్న బిల్లులన్నీ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా బదిలీ ఉత్తర్వులు పొంది రిలీవ్ కానీ ఉపాధ్యాయులను ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి రిలీవ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ సుధాకర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ తిరుపతి, మండల నాయకులు నర్సింలు, లోకేశ్వరరావు, నూర్ బాబా, శ్రీధర్, వెంకటేశ్వర్లు, సద్దాం, రవి, చంద్రశేఖర్, శ్రీనివాస్, షకీల్ పాషా, శ్రీనివాసరెడ్డి, నర్సింలు, అనిల్, ఉమారాణి, వినోద, పద్మ, గీత వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఘనంగా హనుమాన్ జెండా పూజా మహోత్సవం



నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం కాషాయ రంగు హనుమాన్ జెండా పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జనవరి 22 న అయోధ్య రామ మందిర ప్రారంభాన్ని పురస్కరించుకుని ఇంటింటికి హనుమాన్ జండా అందించాలని శ్రీ వెంకటేశ్వర ఆలయ చైర్మన్ బుక్క రమేష్ ఆధ్వర్యంలో కాషాయ జండాలకు పూజా కార్యక్రమం నిర్వహించి జెండా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, జెడ్పీటీసీ మల్లేశం,శేషం శ్రీనివాసాచారి,నందు పంతులు మాట్లాడుతూ శ్రీ సీతా రామ చంద్రుల ఆశీర్వాదంతో అందరూ బాగుండాలని, అయోధ్య రామయ్య మందిరం ప్రారంభ తరుణం ఆసన్నమైందని,గజ్వేల్ ప్రజ్ఞాపూర్ లో ఇంటింటికి కాషాయ జండా అందిస్తున్న బుక్క రమేష్ కుటుంబ సభ్యులకు దేవదేవుల్ల ఆశీర్వాదం ఉండాలని కోరుకుంటూ హిందువులు ప్రతి ఒక్కరు ఇంటిపై కాషాయ రంగు హనుమాన్ జండా పెట్టుకోవాలన్నారు. అయోధ్య పూజిత అక్షింతలు ఇంట్లో శుభకార్యాలకు వినియోగించుకోవాలని అలాగే రామ ప్రారంభం రోజు ప్రతి ఇంట్లో 5 దీపాలు వెలిగించుకోవాలని, అలాగే ప్రతి దేవాలయంలో ఉదయం నుండి రాత్రి వరకు పూజలు నిర్వహించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పుర ప్రముఖులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

పండగలా ప్రజాపాలన

నవ తెలంగాణ-సిద్దిపేట

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమం పండగలా కొనసాగిందని టీపీసీసీ సభ్యులు గంప మహేందర్‌రావు, కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర కన్వీనర్ నాయిని నరసింహారెడ్డి అన్నారు. శనివారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా 6 గ్యారంటీలను ముమ్మాటికి అమలు చేస్తుందన్నారు. ప్రజాపాలనలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారని తెలిపారు. ప్రజలు ఎన్నో ఆశలు ఆకాంక్షలతో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారని, వారి ఆశలకు అనుగుణంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అనుభవజ్ఞులైన మంత్రివర్గంతో కలిసి ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామనడంపై ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా గత ఎన్నికల్లో పోటీ చేసిన వారే నియోజకవర్గ ఇన్చార్జిలుగా కొనసాగుతారని రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పినందున రాబోయే రోజుల్లో నియోజకవర్గ ఇన్చార్జి హరికృష్ణ నేతృత్వంలోనే ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలు అన్ని జరుగుతాయన్నారు. పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలను, నాయకులను ముమ్మాటికీ కాపాడుకుంటామని తెలిపారు. వారి సామర్థ్యం అనుగుణంగా నామినేటెడ్ పోస్టులను ఇస్తామని చెప్పడం సంతోషంగా



ఉందన్నారు. 20 సంవత్సరాలుగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ కాంగ్రెస్ జెండాను మోసిన వారందరికీ అండగా ఉంటామన్న హామీని స్వాగతిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మైనార్టీ విభాగం ఉపాధ్యక్షులు ఖాలీమొద్దీన్, సీనియర్ నాయకులు దాస అంజయ్య, రాజ బహదూర్ రెడ్డి, షాబోద్దీన్, మహిపాల్ రెడ్డి, కొడారి మల్లారెడ్డి, హర్షద్, బిక్షపతి, సీతా బాలు ,మల్లేశం, మెరుగు రాజు, సాయి, శివ, కృష్ణారెడ్డి, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు వంద రోజుల్లో అందించాలి



నవ తెలంగాణ -గజ్వేల్

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేయాలని డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు అన్నారు. శనివారం గజ్వేల్ మండల్ బేజుగామ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 8 రోజులుగా ప్రజాపాలన ముగిసిన అనంతరం ప్రతి నిరుపేద కుటుంబానికి ఆరు గ్యారంటీలు అందించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర రెండవ కొత్త ప్రభుత్వ కాంగ్రెస్ పార్టీ తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి శుభాకాంక్షలు తెలిపారు. పది సంవత్సరాల కుటుంబ పాలనను ఓడించి కాంగ్రెస్కు అధికారం ఇచ్చారని అన్నారు. ప్రతి నిరుపేద కుటుంబానికి న్యాయం జరిగే విధంగా కాంగ్రెస్ పార్టీ నిలబడుతుందనే నమ్మకంతో ఓటేసి గెలిపించినట్లు తెలిపారు.

పేద వధువుకు పుస్తె మట్టెల అందజేత



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు గ్రామంలో పేద కుటుంబనికి చెందిన గొడుగు యాదవ్వ-సత్తయ్యల కూతురు హేమలత వివాహానికి మంగు ఫణి రాజు స్వంత డబ్బులతో పుస్తె మట్టెలను చేయించాడు. ఈ పుస్తె మట్టెలను శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకుల చేతుల మీదుగా అమ్మాయి తల్లి దండ్రులకు అందించారు. తన స్వంత గ్రామంపైన ప్రజలపైన తన మమకరాన్ని చాటుకున్నందుకు గ్రామస్తులు, అమ్మాయి తల్లి దండ్రులు, బంధువులు కాంగ్రెస్ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా జిల్లా కో ఆర్డినేటర్ చెలికాని యాదగిరి, గ్రామ పురోహితులు ఆదిరాల సాయినాథ్ శర్మ, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గోనెపల్లి శివప్రసాద్ గౌడ్, నంగునూరు టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు అనరాజు నాగరాజు, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు రాగుల కనకయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు రాగుల కృష్ణ, జంగిటి శ్రీనివాస్, దాసరి కిషన్, దేవులపల్లి శ్రీకాంత్, చింతల రాజు, జంగిటి సంపత్, గౌరబోయిన రాజు, చింతల సత్తయ్య పొల్సాని యాదగిరి, నవీన్, బాబీ, సందీప్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

అంధకారమవుతున్న వలస కూలీల పిల్లల భవిష్యత్తు

- వర్క్‌సైట్ పాఠశాలలను ఏర్పాటు చేయాలి
- డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి

నవ తెలంగాణ- గజ్వేల్

పొట్టకూటికొసం వలస వచ్చిన కూలీల పిల్లల భవిష్యత్తు అంధకారమయమవుతుందని డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం గజ్వేల్‌లో వలస కార్మికుల కుటుంబాలను శనివారం ఆయన కలిశారు. ఈ సందర్భంగా ఏగొండ స్వామి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కలెక్టరేట్ భవన నిర్మాణానికి, మెడికల్ భవన నిర్మాణానికి, గజ్వేల్, దుబ్బాక డివిజన్ పరిదిలో కాటన్ జిన్నింగ్ మిల్లుల దగ్గర నిర్మాణంలో పని చేస్తున్న వారి పిల్లల భవిష్యత్తు కోసం పాఠశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. నూతన వెంచర్‌ల దగ్గర, పౌల్ట్రీ ఫామ్‌ల దగ్గర, ఇటుక బట్టీల దగ్గర అధికారులు చెప్పిన లెక్కల ప్రకారమే 17 వర్కుసైట్లలో దాదాపు 480 మంది పిల్లలను గుర్తించినా, వారికి చదువు అందని ద్రాక్షలాగే మిగిలిపోతుందన్నారు. ఈ విషయంలో కార్మిక శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేసి వర్కుసైట్ పాఠశాలలను ఏర్పాటు చేయాల్సి ఉండగా అధికారులు పట్టించుకోలేదన్నారు. అధికారులు కార్యాలయాలకే పరిమితమవుతూ పిల్లల భవిష్యత్తును మొగ్గలోనే



తుంచి వేయటం భావ్యం కాదన్నారు. వలస కార్మికులకు ఉపాధి కల్పించడం ఎంత ముఖ్యమో వారి పిల్లలకు చదువు చెప్పించడం కూడా అంతే ముఖ్యంగా భావించి జిన్నింగ్ మిల్లుల వద్ద పాఠశాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. యాజమానులు, ఇటుక, వెంచర్‌ల వ్యాపారస్తులు ఇందుకోసం సహకరించాలని, వెంటనే అధికారులు క్షేత్ర స్థాయిలో పిల్లలను గుర్తించి వారికి వర్కుసైట్ పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరారు.

అనర్హుల పేర్లు తొలగించాలి

అర్హులందరికీ డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వాలి

సమగ్రంగా సర్వే చేసి విధిగా జోక్యం చేసుకోవాలి

గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డికి వినతి



నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ పట్టణంలో గత ప్రభుత్వం ఎంపిక చేసిన డబల్ బెడ్ రూమ్ ఇండ్ల జాబితాలో అనేకమంది అనర్హుల పేర్లు వచ్చాయని, వాటిని తొలగించాలని, అర్హులందరికీ డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని డబల్ బెడ్ రూమ్ సాధన కమిటీ కన్వీనర్ సందబోయిన ఎల్లయ్య అన్నారు. డబల్ బెడ్ రూమ్ సాధన కమిటీ ఆధ్వర్యంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత ఇండ్లు స్థలాలు కలిగిన వారికి సొంత ఇండ్లపై ఆదాయం వస్తున్న వారికి గత ప్రభుత్వం డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించిందని సమగ్రంగా సర్వే నిర్వహించలేదన్నారు. దీనిపై పలు దఫాలుగా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామని తెలిపారు. డబల్ బెడ్ రూమ్ ఇండ్లను ఇండ్లు లేని పేదలకు కేటాయించాలన్నారు. 30 సంవత్సరాలుగా గజ్వేల్ పట్టణంలో కిరాయికి ఉంటూ కుటుంబాన్ని పోషించుకుంటూ అనేకమంది పేదలు బతుకుతున్నారని అన్నారు. అనేకమంది ఒంటరి మహిళలు ఆటో డ్రైవర్లు కార్మికులు పెరుగుతున్న ధరలతో కుటుంబాన్ని పోషించుకోలేక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని సమగ్ర సర్వే నిర్వహించి ఇండ్లేలేని వారికి డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం 2300 మందికి పట్టా సర్టిఫికెట్ ఇచ్చిందన్నారు. కలెక్టర్‌తో చర్చించి ఇండ్లు లేని పేదలకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాయిని యాదగిరి, నర్సింలు పద్మ, కవిత, అనిత, లక్ష్మి, మహేందర్, శివ, సంపత్, యాదగిరి, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

గట్ల మల్యాలలో అయోధ్య అక్షింతలు



నవతెలంగాణ-నంగునూరు

అయోధ్యలో జనవరి 22న రామ మందిరం ప్రారంభోత్సవం నేపథ్యంలో శనివారం నంగునూరు మండలంలోని గట్ల మల్యాల గ్రామంలో అయోధ్య అక్షింతలు గ్రామస్తులకు పంపిణీ చేశారు. గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం రామ భక్తుడు జీవన్ రెడ్డి మాట్లాడుతూ జనవరి 22న అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవం అనంతరం తలంబ్రాలను కుటుంబ సభ్యులు అక్షింతలుగా వేసుకొని శ్రీరాముని ఆశీస్సులు పొందాలని సూచించారు.

నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయాలి

- ఈ నెల 12 న పార్లమెంట్ మార్చ్‌ను జయప్రదం చేయండి
- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జేరిపోతుల జనార్దన్

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక విధానాలు అనుసరిస్తుందని, దేశంలో విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణకు కుట్ర చేస్తున్న బిజెపిని తిరస్కరించి దేశాన్ని రక్షించుకోవాలని, బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానం(ఎన్ ఈ పి-2020) రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ సిద్దిపేట జిల్లా కార్యదర్శి జేరిపోతుల జనార్ధన్ అన్నారు. శనివారం హుస్నాబాద్‌లో ఛలో ఢిల్లీకి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విద్యా విధానాలను వ్యతిరేకిస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జనవరి 12న చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కొత్త విధానాల పేరుతో పాత విధానాలకు స్వస్తి పలుకుతున్నారని తెలిపారు. విద్యా కాషాయీకరణ, కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణకు కుట్ర చేస్తున్న బిజెపికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని అన్నారు. నూతన జాతీయ విద్యావిధానం తీసుకురావడం ద్వారా పేద, మధ్య తరగతి విద్యార్థులు విద్యకు దూరమయ్యే



ప్రమాదం ఉందన్నారు. విద్య పూర్తిగా ప్రయివేట్ వారి చేతుల్లోకి వెళ్తుందని వాపోయారు. తెలంగాణ విభజన హామీ చట్టం ప్రకారం తెలంగాణకు విద్యాసంస్థలు కేటాయించకుండా బిజెపి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవరిస్తున్నదని విమర్శించారు. బిజెపి అవలంబిస్తున్న విధానాలు అప్రజాస్వామికంగా ఉందని, ప్రజాస్వామిక పాలన కావాలంటే మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని పిలుపునిచ్చారు. ఈ నెల 12న జరిగే చలో పార్లమెంట్ మార్చ్ కార్యక్రమాన్ని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు వేల్పుల ప్రసన్న కుమార్, సయ్యద్ సర్దార్, మాలోతు సాయి కృష్ణ, నెర్నాల రాహుల్, వినయ్ వర్ధన్, గణేష్, రోహిత్ నాయక్, మురళి, శ్రీమాన్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల దరఖాస్తుల స్వీకరణ



నవతెలంగాణ-నంగునూరు

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో పాల్గొన్న వారి నుంచి శనివారం నంగునూరు గ్రామపంచాయతీలో దరఖాస్తులను స్వీకరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారంటీ పథకాల్లో ఉద్యమకారులకు ప్రభుత్వం ఇంటి స్థలం ఇస్తామనే హామీ మేరకు దరఖాస్తులు అందజేసినట్లు తెలిసింది. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో నమోదైన ఎఫ్ఐఆర్ కాపీల వివరాలను సైతం అందజేసినట్లు సొసైటీ చైర్మన్ కోల రమేష్ గౌడ్, బీఆర్ఎస్ నాయకుడు చింతల రాంరెడ్డిలు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి చంద్రకళ, ప్రజా పాలన సిబ్బంది పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం మార్నింగ్ వాక్

హమాలీ కార్మికులతో సమావేశం



నవ తెలంగాణ హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ పట్టణంలోని 14వ వార్డులో శనివారం ఉదయం మంత్రి పొన్నం ప్రభాకర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, వార్డు ప్రజలతో కలిసి మార్నింగ్ వాక్ చేశారు. వార్డు ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హుస్నాబాద్ పట్టణంలోని ఆదర్శ హమాలీ సంఘం కార్మికులతో కలిసి కార్మికుల సమస్యలు, ఆరోగ్య క్షేమలు అడిగి తెలుసుకున్నారు. హుస్నాబాద్‌లో తన విజయం కోసం కృషి చేసిన హమాలీ సంఘం కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే హమాలీ సంఘం కూలీల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, సామాజిక సేవకురాలు కర్ణ కంటి మంజులరెడ్డి, ప్రజా ప్రతినిధిలు తదితరులు పాల్గొన్నారు

ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలించిన అసిస్టెంట్ కలెక్టర్



నవ తెలంగాణ- గజ్వేల్

ప్రజా పాలన కార్యక్రమం చివరి రోజు శనివారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని మల్లన్న సాగర్ కాలనీలో ప్రజాపాలనను సిద్దిపేట జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ గరిమా అగర్వాల్ తనిఖీ చేశారు. ప్రజా పాలనలో కార్యక్రమంలో ప్రజల నుండి తీసుకుంటున్న విజ్ఞప్తులు వివరాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు సూచన సలహాలు ఇచ్చి వినతులను స్వీకరించాలని ఆమె సూచించారు. గత వారం రోజులుగా ప్రజా పాలన కార్యక్రమం లో దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఉపయోగపడేలా అధికారులు సిబ్బంది పనిచేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఆర్ డి ఓ బన్సీలాల్, తాసిల్దార్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ల పంపిణీ



నవ తెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం రామవరం గ్రామ యువతకు గ్రామ పంచాయతీ తరపున శనివారం క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత క్రీడారంగల్లో రాణించాలనే దృక్పథంతో యువతకు ప్రోత్సాహంగా క్రికెట్ కిట్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, అక్కన్నపేట సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి, మాజీ ఎంపిటిసిలు వనపర్తి నరేష్, లింగాల కనకయ్య, మాజీ సర్పంచ్ బుర్ర ప్రభాకర్, నాయకులు బొమ్మ శ్రీశైలం, లింగాల శ్రీనివాసు పాల్గొన్నారు.



ప్రజాపాలన దరఖాస్తుల నమోదు ప్రక్రియ

నవతెలంగాణ-దుబ్బాక

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అభయ హస్తం ద్వారా ఆరు గ్యారెంటీ పథకాలకు ప్రజల నుండి భారీ సంఖ్యలో అప్లికేషన్లను స్వీకరించడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి తెలిపారు. నేటి వరకు 8713 దరఖాస్తులు స్వీకరించామన్నారు. దరఖాస్తుల వివరాలను నమోదు చేసేందుకు 20 ప్రత్యేక కంప్యూటర్లను ఏర్పాటు చేశామన్నారు. శనివారం దుబ్బాక పురపాలిక కేంద్రంలోని కొనసాగుతున్న ప్రజాపాలన దరఖాస్తుల డాటా ఎంట్రీ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ ప్రక్రియ ఈనెల 17 వరకు కొనసాగుతుందన్నారు.శానిటరీ ఇన్ స్పెక్టర్ దిలీప్, పలువురు సిబ్బంది ఉన్నారు.

కొమురవెల్లి పాలకమండలిలో కురుమలకు అన్యాయం



నవతెలంగాణ-మద్దూరు

కురుమల ఇలవేల్పు కొమురవెల్లి ఆలయ పునరుద్ధరణ కమిటీలో కురుమలకు చోటు కల్పించకపోవడం అన్యాయమని దూల్మిట్ట కురుమ సంఘం మండల ఉపాధ్యక్షుడు శేవోల్ల కృష్ణ అన్నారు. ఆయన శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో కురుమలకు అన్ని రంగాలలో న్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒంటెత్తు పోకడతో కురుమలను విస్మరిస్తుందని ఆరోపించారు. గతంలో కొమురవెల్లి ఆలయ పాలకమండలి చైర్మన్గా బీఆర్ఎస్ ప్రభుత్వం కురుమలను నియమించినట్లు గుర్తుచేశారు. నేడు కొమురవెల్లి లో జరగనున్న మల్లన్న స్వామి కళ్యాణాన్ని ఒగ్గు జానపద . పద్ధతిలో నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఇంటింటికీ అయోధ్య శ్రీరాముడి అక్షింతలు



నవ తెలంగాణ- రాయపోల్

రాయపోల్ మండల పరిధిలోని వడ్డేపల్లి గ్రామంలో శనివారం శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర బాధ్యులు ఇంటింటికీ అయోధ్య శ్రీరాముని అక్షింతలను పంపిణీ చేశారు. రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులు భజనలు కీర్తనలు పాడుతూ ఇంటింటికి తిరిగి అయోధ్య రాముని అక్షింతలతో పాటు, భవ్య రామ మందిర నిర్మాణ నమూనా చిత్రపటం, కరపత్రాన్ని అందజేశారు. రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రామాలయ కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటికి శ్రీరాముని అక్షింతలు పంపిణ చేశారు.ఈ కార్యక్రమంలో నటరాజ్ శర్మ చంద్రశేఖర్, రాజా గౌడ్, నరేష్ గౌడ్, కృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికునికి గాయాలు



నవతెలంగాణ-మద్దూరు

తాటి చెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు కింద పడిన గీత కార్మికుడికి గాయాలైన సంఘటన మండలంలోని సలాక్‌పూర్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం. ఆ గ్రామానికి చెందిన వగలబోయిన నర్సింలు రోజు మాదిరిగానే తాటి చెట్టు ఎక్కేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి కింద పడడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గాయపడిన నరసింహులను కల్లుగీత కార్మిక సంఘం సిద్దిపేట జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్, చేర్యాల పట్టణ గౌడ సంఘం అధ్యక్షుడు అంబాల బుచ్చి రాములు, డైరెక్టర్ బొంగోని భాస్కర్, నాయకులు గుండాల గణేష్, ఆముదాల రంజిత్, శ్రీనివాస్, శేఖర్, మల్లయ్య, స్వామి తదితరులు పరామర్శించారు. కలుగీత కార్మిక సంఘం సిద్దిపేట జిల్లా కార్యదర్శి బండ కింది అరుణ్ మాట్లాడుతూ నిరుపేద కల్లుగీత కార్మికుడు వగలబోయిన నరసింహులు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు

బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకుల అందజేత



నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రానికి చెందిన పత్రి లత ఇటీవల ఆనారోగ్యంతో మృతి చెందారు. శనివారం స్థానిక శివసేన యూత్ అసోసియషన్ అధ్వర్యంలో బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేశారు. యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు గుభిరే శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎలిగే సతీష్, సహాయక కార్యదర్శి గుభిరే చంద్రం, ఉపాధ్యక్షుడు అంతటి రాకేష్, గుభిరే హరి ప్రకాశ్ పాల్గొన్నారు.

నేడే కొమురెల్లి మల్లన్న కల్యాణం



నవతెలంగాణ-కొమురవెల్లి

కొమురవెల్లి మల్లన్న కల్యాణానికి తోటబావి ప్రాంగణం ముస్తాబైంది. ఆదివారం గంటల 10.45 గంటలకు వీరశైవ ఆగమన శాస్త్ర సంప్రదాయం ప్రకారం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అర్చకులు, అధికారులు, పాలక మండలి సభ్యులు కల్యాణం సందర్భంగా ప్రభుత్వం తరుపున మల్లన్న స్వామికి, మేడలాదేవి, గొల్లకేతమ్మ అమ్మవార్లకు మంత్రులు కొండ సురేఖ, పొన్నం ప్రభాకర్, జనగామ డీసీసీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డిలు స్వామికి అమ్మవార్లకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించనున్నారు. మల్లన్న కల్యాణంను ఉజ్జయిని పీఠాధిపతి శ్రీ1008 జగద్గురు సిద్ధిలింగరాజ కేంద్ర శివాచర్య మహా స్వామిజీ పర్యవేక్షణలో నిర్వహించనున్నారు. కొమురవెల్లిలో మల్లన్న జాతర మార్గశిర మాసం చివరి ఆదివారంతో ప్రారంభమై పాల్గొన మాసం చివరి సోమవారం అగ్నిగుండాలతో జాతర బ్రహ్మోత్సవాలు ముగిస్తాయి. మల్లన్న కళ్యాణాన్ని తిలకించడానికి సుమారు 30 వేల మంది భక్తులు వస్తారని అధికారులు భావిస్తున్నారు. ఆదివారం సాయంత్రం ఏడు గంటలకు మల్లికార్జున స్వామి రథోత్సవం నిర్వహించడంతో కళ్యాణ తంతు ముగిస్తుంది.

మల్లన్న కళ్యాణం ఏర్పాట్లు

మల్లన్న కళ్యాణంకు తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, చత్తీస్గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలిరానున్న నేపథ్యంలో ఆలయ అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. కొమురవెల్లిలోని ఆలయ రాజగోపురం, ప్రహరీ గోడలు విద్యుత్ దీపాలతో అలంకరించారు. రాజగోపురం నుంచి తోటబావి వరకు బట్టలతో శాదియానా పందిళ్ళు వేసి అందంగా తీర్చిదిద్దారు. కళ్యాణ మండపంలో వివిఐపిలకు, విఐపి, దోనర్స్, భక్తులు తిలకిం చేందుకు ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేశారు. భక్తుల కోసం మంచినీరు, చలువ పందిళ్ళు వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలు ఏర్పాట్లు చేశారు.

బియ్యం సేకరణతో కళ్యాణతంతు ప్రారంభం

కొమురవెల్లి మల్లన్న కళ్యాణం సందర్భంగా ఆదివారం తెల్లవారుజామున జరిగే దృష్టి కుంభాలలో వినియోగించేందుకు బియ్యాన్ని ఊరేగింపుగా మేలతాళాలతో ఆలయ అర్చకులు ఊరేగింపుగా సేకరించారు. బియ్యాన్ని మొదట ఆలయ ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్ ఇంట్లో వీరభద్రుని ఖడ్గం పళ్లెరానికి ప్రత్యేక పూజలు, దండకాలు వేస్తూ బియ్యం సేకరించారు. అనంతరం అర్చకుల ఇండ్ల నుండి గ్రామస్తుల నుంచి బియ్యాన్ని సేకరించి మల్లన్న ఆలయానికి చేర్చారు. బియ్యాన్ని ఆదివారం మల్లన్న కళ్యాణం రోజు తెల్లవారుజామున దృష్టి కుంభాలలో వినియోగించి ప్రత్యేక పూజలు చేసి మల్లన్న తొలిదర్శనం చేసుకోవడం ఆనవాయితీగా వస్తున్న ఆచారం.

పటిష్ట పోలీసు బందోబస్తు

కొమురవెల్లి మల్లికార్జునస్వామి కల్యాణం సందర్భంగా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు అడిషనల్ డిసిపి అడ్మిన్ అందె శ్రీనివాసరావు కళ్యాణం జరుగు తోటబావి వద్ద కల్యాణ మండపం, పరిసర ప్రాంతాలను వీఐపీ పార్కింగ్, జనరల్ పార్కింగ్, దర్శన ప్రదేశాలలో బందోబస్తును 4 సెక్టార్లుగా విభజించి పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. టెంపుల్ ఆవరణలో 80 సీసీ కెమెరాలతో పటిష్టమైన నిఘాఏర్పాటు చేశారు. ఇద్దరు అడిషనల్ డీసీపీలు, ముగ్గురు ఎసిపిలు, 12 మంది సిఐలు, 18 మంది ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుళ్లు, మహిళ హెూంగార్డులు, బీడీ టీమ్స్, యాక్సెస్ కంట్రోల్, రోప్ పార్టీ మొత్తం 300 మంది అధికారులు సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈకార్యక్రమం లో ఏసీపీలు సతీష్, సురేందర్ రెడ్డి, రమేష్, రవీందర్ రాజు, ప్రసన్న కుమార్, సీఐలు, సత్యనారాయణరెడ్డి, రఘుపతిరెడ్డి, సీఐలు, ఎస్ఐలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు మంచి పేరు తేవాలి

- మున్సిపల్ చైర్ పర్సన్ కడవేరు మంజుల రాజనర్సు



నవ తెలంగాణ - సిద్దిపేట

జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో బాగా ఆడి జిల్లాకు మంచి పేరు తేవాలని మున్సిపల్ చైర్ పర్సన్ కడవేరు మంజుల రాజనర్సు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో అండర్ 14 , 16 బాల బాలికల విభాగంలో ఫిబ్రవరి 16 నుండి 19 వరకు గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో జరిగే జాతీయ అంతర్ జిల్లాలో అథ్లెటిక్స్ పోటీలకు, ఈ నెల 28 నుండి 30 వరకు కొత్తగూడెంలో జరిగే అండర్ 8,10,12 సబ్ జూనియర్ జిల్లా జట్టును ఎంపిక చేశారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ అధ్యక్షులు గ్యాదరి పరమేశ్వర్ , రాష్ట్ర పరిశీలకులు మధుసూదన్, జిల్లా కార్యదర్శి పన్యాల రామేశ్వర్ రెడ్డి, జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి కర్రోల్ల వెంకట స్వామి గౌడ్, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు బండారుపల్లి శ్రీనివాసులు, ఎర్వ అశోక్, ఉప్పలయ్య, మల్లేశం, కనక రెడ్డి, ప్రభాకర్, కృష్ణ కుమార్, నిశాంక్, లీలానంద్, సాయి కృష్ణ, తుల్జారామ్, రాజు, సంతోష్, భాను పాల్గొన్నారు.

అభయహస్తం దరఖాస్తులకు విశేష స్పందన

- కాంగ్రెస్ మండల అధ్యక్షులు జంగపల్లి ఐలయ్య



నవతెలంగాణ-అక్కన్నపేట

మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జంగపల్లి ఐలయ్య అధ్యక్షతన అక్కన్నపేట మండలంలోని గండిపల్లి, రామవరం, గౌరవెల్లి, పోతారం గ్రామాలలో ప్రజాపాలన కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ అభయహస్తం పథకాల అమలుతో సబ్బండ వర్గాలకు అనుకూలంగా రూపొందించిన కార్యక్రమలతో ప్రజల్లో విశేష స్పందన వస్తుందని సంతోషం వ్యక్తం చేశారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ లబ్దిదారులను ఎంపిక చేసేందుకు సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్లు బుర్ర ప్రభాకర్ గౌడ్, బండి కుమారస్వామి, గండిపల్లి యంపిటిసి ప్రమీల-సోమనాయక్, గౌరవెల్లి సర్పంచ్ బైరగోని పుష్పలీల, హుస్నాబాద్ నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్ మంద పర్శరాము గౌడ్, రామవరం ఉప సర్పంచ్ శేరు కనుకయ్య యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పంద్రాల దామోదర్, చొక్కం గణేష్, బంధారం శ్రీనివాస్, ఆయా గ్రామాల అధ్యక్షులు బంధారం రాజయ్య, రిక్కల కృష్ణారెడ్డి, అక్కన్నపేట సోషల్ మీడియా కన్వీనర్ పంగ రాకేష్, ఓగులవేణి రవి, బైరగోని శ్రీనివాస్, బొమ్మ శ్రీశైలం, బొమ్మ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



నవతెలంగాణ-నంగునూరు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేవిధంగా చూస్తామని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి స్పష్టం చేశారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన ప్రజాపాలన ఆరు గ్యారంటీ దరఖాస్తుల స్వీకరణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన ప్రభుత్వాన్ని ఎన్నుకున్న ప్రజల కోసం ప్రభుత్వ అధికారులను ప్రతి గ్రామానికి పంపి వారి వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వనికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రకళ, సోషల్ మీడియా జిల్లా కోర్డినేటర్ చెలికాని యాదగిరి, గ్రామ శాఖ అధ్యక్షులు అనరాజు నాగరాజు, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గోనెపల్లి శివప్రసాద్ గౌడ్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు రాగుల కనకయ్య, తుపాకుల శ్రీనివాస్, దేవులపల్లి పర్శరాములు, దేవులపల్లి శ్రీకాంత్, అంగన్వాడీ టీచర్లు దేవులపల్లి భారతి, రాగుల రాజమళ్ళవ్వ, బడె విమల, సుద్దాల పద్మ తోట పద్మ, తుమ్మకొలు సుజాత తదితరులు పాల్గొన్నారు.

సజావుగా అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ

- మండలంలో సుమారు 12,020 దరఖాస్తుల స్వీకరణ
- ప్రజాపాలనకు ప్రజల్లో విశేష స్పందన



నవతెలంగాణ-బెజ్జంకి

ఈ నెల 6వ తేదీ వరకు నిర్వహించిన ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం మండలంలో సజావుగా సాగింది. ఆయా గ్రామాల్లో ప్రభుత్వం చేపట్టిన అభయహస్తం దరఖాస్తుల స్వీకరణకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మండల వ్యాప్తంగా సుమారు 12,020 అభయహస్తం దరఖాస్తులను ప్రజల వద్ద నుండి స్వీకరించామని, దరఖాస్తుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నామని ఎంపీడీఓ దమ్మని రాము తెలిపారు. ప్రభుత్వాదేశానుసారం మండలంలో అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ముగిసిందని ఎంపీడీఓ తెలిపారు.

దేవులపల్లి రమేశ్‌కు సాహిత్యసేవా పురస్కారం



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు గ్రామానికి చెందిన దేవులపల్లి రమేశ్‌కు సాహిత్య సేవా పురస్కారం లభించింది. తెలంగాణ సారస్వత పరిషత్ హైదరాబాద్‌లో వీఎస్ఆర్ చారిటబుల్ ఆధ్వర్యంలో 11వ వార్షికోత్సవం నిర్వహించారు. వివిధ రంగాలలో సేవలందించిన వారికి పురస్కారాలు అందజేశారు. మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో తెలుగు అతిథి ఉపాధ్యాయుడుగా దేవులపల్లి రమేశ్ విధులు నిర్వహిస్తున్నారు. ముఖ్య అతిధులు సుంకర సత్యనారాయణ (డీసీపీ రిటైర్డ్) కిషోర్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు, హాస్యవధాని డా. శంకర్ నారాయణ , సీనియర్ జర్నలిస్టు, వీఎస్ఆర్ చైర్మన్ డా. వల్లం నవీన్, డా. రాధ కుసుమల చేతుల మీదుగా సాహిత్య సేవ స్ఫూర్తి పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా దేవులపల్లి రమేశ్ మాట్లాడుతూ వీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ తన సేవలను గుర్తించి పురస్కారం ఇచ్చినందుకు చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాష చైతన్య సమితి అధ్యక్షులు బడే సాబ్, జర్నలిస్టులు ప్రముఖ టీవీ యాంకర్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంతి వీఆర్వో కుటుంబానికి పరామర్శ



నవ తెలంగాణ -గజ్వేల్

గజ్వేల్ విశ్రాంతి వీఆర్వో, పెన్షనర్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి రేకుల నారాయణరెడ్డి మృతి చెందారు. శనివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆ కుటుంబాన్ని ఓదార్చే ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. స్థానిక కౌన్సిల్ సభ్యులు షాహినా సమీర్, గంగిశెట్టి చందనా రవీందర్, విశ్రాంతి ఉద్యోగులు కాలనీవాసులు ఓదార్చారు.

చట్టసభల్లో మహిళల వాటా సాధిద్దాం

ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశ లత


నవ తెలంగాణ-సిద్దిపేట

చట్టసభల్లో మహిళల వాటా సాధిద్దామని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశ లత అన్నారు. జిల్లా కేంద్రంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా



) జిల్లా అధ్యక్షురాలు సింగిరెడ్డి నవీన అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్యాకెట్ క్యాలెండర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజకీయ కుట్రను ఎదిరిస్తాం, పోరాటాల ద్వారా హక్కులు సాధించుకుని అన్ని రంగాల్లో ముందుకు వస్తుంటే, ఏదో ఒక రకంగా మహిళలను అనేక రూపాల్లో మతం కులం పేర్లతో అణగదొక్కడానికి ప్రభుత్వాలు పనిచేస్తున్నాయన్నారు. వాటిని ఎదుర్కోవడానికి మహిళలు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ సాధించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో ఒకటి ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు సంతోషకరమైన విషయం కానీ, మారుమూల ప్రాంతాల్లోని మహిళలకు ఈ అవకాశం అందడం లేదని, అలాగే మహిళలకు అన్ని బస్సుల్లో కూడా ఈ అవకాశం కల్పిస్తే బాగుంటుందన్నారు. అలాగే మిగతా అన్ని పథకాలను ప్రభుత్వం వెంటనే అమలు పరచడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు మంజులత, లక్ష్మి, అనిత, లక్ష్మి, బాలవ్వా, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

పుస్తె మట్టెల అందజేత



నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట సుభాష్ నగర్ వీధి నిరుపేద కుటుంబానికి చెందిన కీర్తన(అఖిల) వివాహానికి సిద్దిపేట పద్మశాలి సమాజం అధ్యక్షుడు కాముని రాజేశం - బాల్ లక్ష్మి పుస్తె మట్టెలు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు సేవ చేయడంలో ఎంతో సంతృప్తి ఉంది అన్నారు. ఈ కార్యక్రమం లో ఇందిరానగర్ పద్మశాలి సమాజం అధ్యక్షులు డాక్టర్ సామల విట్టల్, కాముని నగేశ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార దిశగా నవతెలంగాణ



నవతెలంగాణ- సిద్దిపేటరూరల్

ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారిధిగా ఉంటూ పరిష్కార దిశగా నవ తెలంగాణ పత్రిక ముందడుగు వేస్తోందని సీఐ చెరాలు, ఎస్సై కిరణ్‌రెడ్డి అన్నారు. శనివారం సిద్దిపేట పోలీస్ స్టేషన్ కార్యాలయంలో నవతెలంగాణ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ నవ తెలంగాణ పత్రిక ప్రజా సమస్యలతో పాటు ప్రభుత్వానికి పరిష్కార దిశగా సూచనలు చేస్తూ ప్రజల ఆదరణ పొందిందన్నారు. నూతన సంవత్సర సందర్భంగా నవ తెలంగాణ పత్రిక మరింత ఆదరణ పొంది ప్రజల పక్షాన నిలబడిందన్నారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పత్రిక నిలబడాలని సూచించారు. కార్యక్రమంలో నవ తెలంగాణ రూరల్ రిపోర్టర్ మద్దూరి రాజు పాల్గొన్నారు.